తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELTEL/2016/68867
# తెలంగాణ శాసనసభ
TELANGANA SHASANA SABHA
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 20 | ఎడిటర్ పాలగోని రాజేష్ | 08 బుధవారం జనవరి 2025 | పేజీలు 8 వేల 4



## విశ్వవేదికపై
# తెలంగాణ క్రీడారంగం

- స్పోర్ట్స్ వర్సిటీతో అభివృద్ధికి యత్నం
- ప్రపంచ దేశాల్లో నైపుణ్యాల పరిశీలన
- సింగపూర్ పర్యటనలో
- అధ్యయనం చేయనున్న రేవంత్

హైదరాబాద్,జనవరి7
తెలంగాణ రాష్ట్రం క్రీడా రంగంలో కీలకమైన అడుగులు వేయబోతోంది. క్రీడా వర్సిటీ కోసం చేస్తున్న యత్నాలు ఫలిస్తే తెలంగాన క్రీడారంగంలో దూసుకుపోవడం ఖాయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, దేశంలోని అత్యంత ఆధునిక స్థాయిలో లక్ష మంది కూర్చునే సామర్థ్యం కలిగిన భారీ స్టేడియాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీలో లేదా మరో ప్రాంతంలో 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ స్టేడియంలో అత్యాధునిక సాంకేతికతతో క్రికెట్, ఫుట్‌బాల్ వంటి వివిధ క్రీడలకు అనువైన మైదానాలను రూపొందిస్తారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ, మౌలిక సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా మార్చాలన్నది సీఎం రేవంత్ రెడ్డి దృష్టిగా ఉంది

3

## నెరవేరబోతున్న
# రైల్వేజోన్ కల

### నేడు ప్రధాని మోడీ శంకుస్థాపన



విశాఖపట్టణం,జనవరి7
రైల్వే శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఏళ్లుగా ఊరిస్తున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. విశాఖ కేంద్రంగా జోన్ కార్యాలయం నిర్మాణానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్ తో కూడిన జోన్ ఏర్పాటు అనేది డిమాండ్. విభజన చట్టం 13వ షెడ్యూల్లో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రకటన చేసింది. ప్రస్తుతం ఉన్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో కలిపి జోన్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించింది. వాల్తేర్ డివిజన్ ను రెండు భాగాలుగా విభజించి విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని.. మిగిలిన భాగాన్ని తూర్పు కోస్తా రైల్వేజోన్ పరిధిలోని రాయగడ కేంద్రం కొత్త డివిజన్ ఏర్పాటుకు నిర్ణయించింది.

2

## కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు

- బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదు
- ప్రభుత్వం తప్పలను ఎత్తి చూపుతూనే ఉంటాం
- హైదరాబాద్ బ్రాండ్ కోసం కెటిఆర్ కష్టపడ్డారు
- ఈ- ఫార్ములాలో విచారణ చేయమని మాత్రమే హైకోర్టు ఆదేశం
- మీడియా సమావేశంలో హరీష్ రావు వివరణ



3

ఢిల్లీ ఎన్నికలకు
# మోగిన నగారా

- 10న నోటిఫికేషన్ విడుదల -17 వరకు నామినేషన్ల స్వీకరణ
- 20 వరకు నామినేషన్ల ఉపసంహకరణ
- మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆర్ఎన్ఎ): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.



## సుప్రీంకోర్టును ఆశ్రయించిన
# రేవంత్ సర్కార్

హైదరాబాద్,జనవరి 7
: ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో రేవంత్ రెడ్డి సర్కార్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మంగళవారం కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని పిటిషన్‌లో కోరింది. ఫార్ములా–ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యతంర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన రేవంత్ సర్కార్.. కేటీఆర్ కంటే ముందుగానే సుప్రీంకోర్టును ఆశ్రయించింది.(



## కాంగ్రెస్ అంటేనే
# కన్నింగ్

-హామీల అమలుకు వంద కొర్రీలు
: మాజీ మంత్రి కేటీఆర్



# కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత...
## కీలక అంశాలను ప్రస్తావించిన హైకోర్టు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఆర్డర్ కాపీ సిద్ధమైంది. ఈ ఆర్డర్ కాపీలో జడ్జి లక్ష్మణ్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. హెచ్ఎండీఏ పరిధికి మించి డబ్బులు బదిలీ చేసినట్లు ఆర్డర్ కాపీలో హైకోర్టు పేర్కొంది. కేబినెట్ ఆమోదం లేని లావాదేవీలపై విచారణ జరగాలని కోర్టు అభిప్రాయపడింది. అలాగే ఈ చెల్లింపుతో ఎవరు లబ్ధి పొందారో కూడా తెలియాలని ఆర్డర్ కాపీలో పేర్కొంది. కేటీఆర్ దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఉన్నాయని కోర్టు తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా నిధులు బదిలీ చేశారని ఆరోపణలు వచ్చాయని వెల్లడించింది. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూరినట్లు ఆరోపణలు ఉన్నట్లు వెల్లడించింది. ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ధి చేకూర్చారని ఆరోపణలు ఉన్నట్లు కోర్టు తెలిపింది. ఆరోపణల మేరకు పలు సెక్షన్ల కింద ఏసీబీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసే అధికారాన్ని కోర్టు కొన్ని సందర్భాల్లోనే వాడాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. దర్యాప్తు అన్యాయంగా ఉంటేనే కోర్టు తన అధికారాన్ని ఉపయోగించాలని వెల్లడించింది. పోలీసుల అధికారాలను హరించాలనుకోవడం లేదని కోర్టు పేర్కొంది.



ఏసీబీ చేసిన ఆరోపణలపై తాము విచారణ చేయాలనుకోవడం లేదని వ్యాఖ్యానించింది. ప్రజాధనానికి మంత్రులు ట్రస్టీలుగా పనిచేయరని కేటీఆర్ తరఫు న్యాయవాది తెలిపారు. అయితే కేటీఆర్ తరఫు న్యాయవాదితో హైకోర్టు విభేదించింది. ప్రజల ఆస్తులకు మంత్రి బాధ్యుడిగా ఉండాలని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పలు కేసుల్లోని సుప్రీంకోర్టు ఉత్తర్వులను హైకోర్టు ఉదహరించింది. ఉత్తమ పాలన అందించే బాధ్యత మంత్రిపై ఉంటుందని పేర్కొంది.

## రాష్ట్రంలో గుండాయిజం
# నడుస్తుంది

-: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
-భూములు కోల్పోతున్న బాధితులకు పరామర్శ



3

# సంపాదకీయం

# చైనా జలఖడ్గంపై దృష్టి పెట్టాల్సిందే!

మంగళవారం 7-1-2025

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాంతంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక

వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గార్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్ఎస్ఎ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది. దీంతో దీనిపై భారత్ గట్టిగానే వ్యతిరేకిస్తున్నా..అడ్డుకోవడమే మంచిది.


# క్షీణించిన ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం

## ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం

పట్నా,జనవరి7(ఆర్ఎన్ఎ): ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. బీపీఎస్సీ వ్యవహారంలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను సోమవారం పోలీసులు భగ్నం చేసి.. అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆయన షరతులు లేని బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష చేయడంతో ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం క్షీణించిందని.. ఆయనను పట్నాలోని ఆస్పత్రికి తరలించామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రశాంత్ కిశోర్ జనవరి 2న గాంధీ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. గత రెండు వారాలుగా బీపీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలు చేపడుతున్నా, ప్రభుత్వంలో ఎలాంటి కదలిక రావట్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత్ కిశోర్ చట్టవిరుద్ధంగా నిరసన చేపట్టారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి.. కోర్టు ముందు హాజరుపరిచారు. మళ్లీ ఇటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడంతో ప్రశాంత్ దాన్ని తిరస్కరించారు. దీంతో ఆయన్ను బ్యూరో సెంట్రల్ జైలుకు తరలించారు. అనంతరం కోర్టు షరతులు లేని బెయిల్ మంజూరుచేయడంతో సోమవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు. పోలీసులు దీక్షను భగ్నం చేసిన అనంతరం తనను ఎక్కడికి తీసుకువెళ్తున్నారనే విషయం తెలియజేయలేదని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసు వాహనంలోనే కూర్చోబెట్టి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లారన్నారు. సరైన పత్రాలు లేకుండానే తనను కోర్టు నుంచి పోలీసులు తీసుకెళ్లారని పేర్కొన్నారు. తనను జైలుకు కూడా తీసుకెళ్లలేదని పేర్కొనడం గమనార్హం.

# గరికపాటిపై అభ్యంతరకర ప్రచారాలు

## -చట్టప్రకారం చర్యలు తప్పవని బృందం హెచ్చరిక



హైదరాబాద్,జనవరి7

ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

# నెరవేరబోతున్న రైల్వేజోన్ కల

విశాఖపట్టణం,జనవరి7 ఈ ప్రక్రియలో రాయగడ డివిజన్ రూపుదిద్దుకోగా వాల్తేర్ మనుగడ మీద క్లారిటీ లేదు. జోన్, డివిజన్ కొనసాగించడం ద్వారానే ఆశించిన ప్రయోజనాలు సాధ్యం అంటున్నాయి రైల్వే యూనియన్ లు. మొత్తంగా ఎట్టకేలకు రైల్వేజోన్ కల సాకారం అవుతుండగా.. ప్రధాని మోడీ చేతులు మీదుగా శంకుస్థాపన జరుగుతుండటం రాజకీయ వర్గాల ఆసక్తిని రెట్టింపు చేసింది. విశాఖలోని ముడసర్లోవ దగ్గర రైల్వేకు కేటాయించిన భూముల్లో జోనల్ హెడ్ క్వార్టర్ సముదాయం రూపుదిద్దుకోనుంది. ఇక్కడ రైల్వేశాఖకు 52 ఎకరాల స్థలం ఉండగా, సుమారు పదెకరాల్లో కొత్త భవనాలు వస్తాయి. 149 కోట్లతో 9 అంతస్తుల్లో భవనాలు నిర్మాణం కోసం టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది రైల్వేశాఖ. వాస్తవానికి దక్షిణ కోస్తా జోన్ ప్రక్రియ వైసీపీ ప్రభుత్వ హయంలోనే ప్రారంభమైనప్పటికీ భూ కేటాయింపుల్లో జాప్యం జరిగిందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ముడసర్లోవలో ప్రతిపాదించిన భూములు రిజర్వాయర్ క్యాచ్ మెంట్ ఏరియాకు దగ్గరగా వుండటం, సాగు చేసుకుంటున్న రైతుల నుంచి అభ్యతరాలు రావడం కారణం. కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత జోన్ భూములపై వున్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చినగదిలి మండలం ముడసర్లోవలో 52.22 ఎకరాలు కేటాయించింది. గత ఆగస్టులో ఆ భూమిని రైల్వేకు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. మ్యుటేషన్ ద్వారా రైల్వేశాఖకు భూమి ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డుల్లోనూ నమోదైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి రైల్వేజోన్ మైల్ స్టోన్ అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.. రైల్వే జోన్ కోసం భూముల కేటాయింపులో జాప్యం కారణం అవ్వడం పై అధికార, విపక్షాల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. గత ఏడాది జనవరిలోనే తమ ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని.. అదే భూముల్లో జోనల్ కార్యాలయం నిర్మాణం చేస్తూ విమర్శలు చేయడం కరెక్ట్ కాదంటోంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఈ వ్యవహారం పక్కన పెడితే.. తూర్పు కోస్తా రైల్వే జోన్ లో వాల్తేర్ డివిజన్ ప్రస్థానంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థలో ఖాళీలు

## -65 ఐ.టి, రెండు పీఆర్ఓల

## పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్,జనవరి7

:తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐ.టి. ఇన్స్ట్రక్టర్, ఇద్దరు పీఆర్ఓ పోస్టులను భర్తీ చేయడానికి నేటి నుండి ఈనెల 10 వతేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఐ.టి. ఇన్స్ట్రక్టర్లకు ఎంటెక్, బీటెక్, ఎంసీఏ లలో కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు, పీఆర్ఓ పోస్టులకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం పది సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు ఆసక్తి చూపే అభ్యర్థులు ఈనెల 10 వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా మాసబ్ ట్యాంక్ లోని దేశోద్ధారక భవన్ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరకాస్తుఫారాలను పొంది అప్లై చేయాలని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సంస్థ నేడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

# దాచేపల్లి వద్ద పట్టాలు తప్పిన గూడ్స్

పల్నాడు,జనవరి7 పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనివాసపురం వద్ద మంగళవారం ఉదయం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో గుంటూరు- హైదరాబాద్ మధ్య నడవాల్సిన రైళ్ళ ను అధికారులు విజయవాడ మీదుగా దారి మళ్లించారు. విష్ణుపురం రాశి సిమెంట్ ఫ్యాక్టరీకి లోడింగ్ కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రైల్వే పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు.

# నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ భూకంపం

## భూకంప తీవ్రతతో 36మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జనవరి7 : నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ భూకంపం వచ్చింది. భూకంప తీవ్రతతో 36మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం. మంగళవారం ఉదయం ఇక్కడ భూకంపం సంభవించడంతో రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా రికార్డు అయింది. కొన్ని క్షణాల పాటు ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. ఈ విపత్తుతో ఇప్పటి వరకు సుమారు 36 మంది చనిపోయిగా.. మరో 38 మంది త్రీవంగా గాయపడినట్లు చైనా అధికారిక మీడియా తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చింది. కాగా, నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం ఏర్పడింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. దీని తీవ్రతతో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ సహా పలు జిల్లాల్లో భూ ప్రకంపనలు నెలకొన్నాయి. ఈ ప్రకంపనల ధాటికి ప్రజలు భయంతో బయటకు పరుగులు పెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక, ఈ భూ ప్రకంపనలతో భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాలపై కూడా స్వల్పంగా కనిపించింది. డ్రాగన్ కంట్రీలో భూకంప తీవ్రత 6.8గా నమోదు అయింది. కాగా, నేపాల్‌లో తరచూ భారీ భూకంపాలు వస్తుంటాయి. 2015 ఏప్రిల్‌లో ఇక్కడ 7.8 తీవ్రతతో భూకంపం సంభవించడంతో దాదాపు 9వేల మంది మరణించారు.

# కొరకరాని కొయ్యగా బైడెన్ నిర్ణయాలు

## సహజవాయు డ్రిల్లింగ్‌పై ఆంక్షలపై అభ్యంతరం

## అధికారంలోకి రాగానే సమీక్షిస్తానన్న ట్రంప్

వాషింగ్టన్,జనవరి7

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షుడిగా తన చివరి సమయంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలు, చర్యలతో పరిపాలనను, అధికార బదిలీని కష్టతరం చేశారని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. తాను అధికారం స్వీకరించడానికి ముందే ఎన్ని కష్టతరమైన మార్పులు సాధ్యమో అన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థలో ఇలా జరగడం మునుపెన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఖరీదైన, అర్థంలేని పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చి గ్రీన్ న్యూ స్కామ్, ఇతర రకాలుగా డబ్బును వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఉత్తర్వుల విషయంలో అమెరికా ప్రజలు భయపడాల్సిన పనిలేదని, తాను అధికారం చేపట్టగానే వాటిని తొలగిస్తానన్నారు. తన పరిపాలనలో అమెరికాను మరింత శక్తివంతమైన దేశంగా నిలబెడతానన్నారు. ఇప్పటికే తాము రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ ద్వారా ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా అమెరికా తీర ప్రాంతంలో చమురు, సహజవాయువు కోసం చేసే డ్రిల్లింగ్‌ను బైడెన్ నిషేధించారు. కాలిఫోర్నియా, ఒరెగాన్, తూర్పుగల్ఫ్ ఆఫ్ మెక్సికో మొదలైన ప్రదేశాల్లో 625 మిలియన్ ఎకరాల తీర ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్‌లు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దేశీయ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని వాగ్దానం చేసిన ట్రంప్ ప్రమాణస్వీకారం చేయడానికి కొద్ది రోజుల ముందు బైడెన్ ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ సోమవారం లాంఛనంగా ధ్రువీకరించింది. గొప్ప ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని కాంగ్రెస్ ధ్రువీకరించడం చరిత్రలో పెద్ద పరిణామమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్‌పై పోటీచేసి ఓడిపోయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆయన విజయాన్ని ధ్రువీకరించే లాంఛనప్రాయ క్రతువుకు అధ్యక్షత వహించారు. అధికార బదలాయింపు శాంతియుతంగా జరిగేలా చూడడం తన పవిత్ర కర్తవ్యమని ఆమె ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఎంతటి సున్నితమైనదో చూస్తున్నామని, అధికార మార్పిడి సాఫీగా పూర్తయ్యేందుకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వీలైనన్ని ఇబ్బందులు సృష్టించే పనిలోపడ్డారు ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్. తాజాగా ట్రంప్ లక్ష్యమైన గ్యాస్, చమురు డ్రిల్లింగ్ పనులు ముందుకువెళ్లకుండా ఆయన ఏకంగా 75 ఏళ్ల నాటి ఓ చట్టాన్ని తెర పైకి తీసుకొచ్చారు. అమెరికా సముద్ర జలాల్లో దాదాపు 62 కోట్ల ఎకరాల ప్రదేశాన్ని ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి కాపాడేందుకు దీనిని వాడనున్నారు. ఈ విషయాన్ని సోమవారం శ్వేతసౌధం ప్రకటించింది. శిలాజ ఇంధన ఉత్పత్తిని పెంచాలన్న ట్రంప్ ప్లాన్ అమలును ఇది మరింత జఠిలం చేయనుంది. 1953 ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్ ల్యాండ్ యాక్ట్ ఇందుకోసం బైడెన్ వాడుతున్నారు. దీని ప్రకారం చమురు, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్‌ను పూర్తిగా మినహాయించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది. తూర్పు, పశ్చిమతీరాలు, తూర్పు గల్ఫ్ మెక్సికో, అలాస్కాలోని ఉత్తర బేరింగ్ సముద్రం వంటివి వీటి కిందకు వస్తాయి. అంతేకాదు.. అసలు ఈ చట్టం తర్వాత వచ్చే అధ్యక్షుడికి దానిని అడ్డుకొనే శక్తిని ఇవ్వదు. దీనిని ఆపాలంటే ట్రంప్ మళ్లీ కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. 'తాజాగా వారు అనుకొన్నచోట్ల డ్రిల్లింగ్ చేస్తే.. కోలుకోలేనంత నష్టం వాటిల్లుతుంది. వాస్తవానికి అమెరికా ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి అది అనవసరం. రిస్క్ చేయాల్సినంత విలువైందేమీ కాదు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాలను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తున్నాయి. మనం క్లీన్ ఎనర్జీ ఆర్థికవ్యవస్థ దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ తీరాలను మన పిల్లలు, మనవళ్ల కోసం సంరక్షించి తీరాల్సిందే. కాలిఫోర్నియా నుంచి ఎ÷-లోరిడా వరకు రిపబ్లికన్లు, డెమోక్రట్ గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, తీరప్రాంత ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చమురు, సహజవాయు డ్రిల్లింగ్ నుంచి తీరాలను రక్షించడానికి ఏకతాటి పైకి రావాలి' అని జోబైడెన్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ కార్యవర్గంలోని ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్న కరోలైన్ లెవిట్టీ స్పందిస్తూ.. దీనిని అమెరికా ప్రజలపై అవమానకర ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. చమురు వెలికితీతలో బైడెన్ విఫలమయ్యారని అభివర్ణించారు.

# విశ్వవేదికపై తెలంగాణ క్రీడారంగం

. దీనికి సంబంధించిన ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. ప్రస్తుతం గుజరాత్‌లోని మోతేరా స్టేడియం దేశంలోనే అతిపెద్దది, 1.32 లక్షల మంది సామర్థ్యంతో ఉంది. తెలంగాణలో నిర్మించబోయే ఈ కొత్త స్టేడియం గుజరాత్ స్థాయికి తగ్గదిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మైదానం అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు, ఐపీఎల్ మ్యాచ్‌లకు కేంద్రంగా మారుతుందని అంచనా.క్రీడాభివృద్ధిపై మరింత అవగాహన పొందేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్కడి క్రీడా మైదానాలు, శిక్షణా విధానాలు, ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. తెలంగాణలో ఇప్పటికే 760 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్ రాష్ట్ర క్రీడారంగానికి దిశానిర్దేశర చేయనుంది. క్రీడలకు సంబంధించిన ప్రణాళికలు, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, సమగ్ర విధానం అమలులోకి తెచ్చే యోచనలో ఉంది. 20-24 తేదీల్లో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులపై కూడా చర్చించనున్నారు. తెలంగాణ క్రీడా రంగానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అయిన ఈ స్టేడియం, రాష్ట్రాన్ని క్రీడా భవిష్యత్తు కేంద్రంగా మార్చేందుకు సహాయపడుతుదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# కాంగ్రెస్ అంటేనే కన్నింగ్

హైదరాబాద్, జనవరి 7 :
కాంగ్రెస్ అంటేనే కన్నింగ్ అని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణలో అర్ధ గ్యారెంటీ అమలు, మిగతా గ్యారెంటీలకు అరవై షరతులు అని ఎద్దేవా చేశారు. అబద్ధాల కాంగ్రెస్‌లో అన్ని అరకొర గ్యారంటీలు, అర్ధ సత్యాలే అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అమలవుతున్నది ఒకే ఒక్క గ్యారంటీ.. అది మోసం అంటూ ఫైరయ్యారు. తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహానికి సంబంధించిన నిరసన సెగ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయానికి తాకిందని చెప్పారు. రైతు డిక్లరేషన్‌ను ఎలా అమలుచేస్తున్నారో వివరించేందుకు తెలంగాణకు ఎందుకు రావడం లేదని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. రైతు భరోసాపై తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొంటూ ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం గేటుకు గుర్తుతెలియని వ్యక్తులు పోస్టర్లు అంటించారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సందర్భంగా రైతు భరోసాగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని, ఇప్పుడు దానిపై కాంగ్రెస్ యూ టర్న్ తీసుకున్నదని పేర్కొన్నారు. 2024లో రైతులకు పెట్టుబడి సాయంగా విడుదల చేసింది గుండు సున్నానే అంటూ రాశారు. ఎకరాకు రూ.12 వేలు ఇస్తామంటూ రూ.15 వేలపై సీఎం రేవంత్ రెడ్డి యూ టర్న్ తీసుకున్నారని పోస్టర్లలో తెలిపారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అంటేనే కన్నింగ్ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.



# కేటీఆర్‌కు ఈడీ మరోసారి నోటీసులు

## 16న విచారణకు రావాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 7
ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 16న విచారణకు రావాలని కేటీఆర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి ఈడీ ఎదుట కేటీఆర్ మంగళవారంహాజరు కావాల్సి ఉంది. అయితే, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని ఇప్పటికే హైకోర్టులో వేసిన కేసులో తీర్పు రిజర్వ్‌లో ఉందని తెలిపారు. హైకోర్టుపైనున్న గౌరవంతో.. తీర్పును వెలువరించేంత వరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ సమాధానం పంపారు. అయితే ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది కోర్టు. ఈ క్రమంలో ఈడీ తాజాగా మళ్లీ నోటీసులు జారీ చేసి 16న విచారణకు రావాలని కేటీఆర్‌ను ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారు. కాగా, క్వాష్ పిటన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు.

# రాష్ట్రంలో గుండాయిజం నడుస్తుంది

## : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## -భూములు కోల్పోతున్న బాధితులకు పరామర్శ

మంచిర్యాల, జనవరి 7 : రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంచిర్యాలలో ప్రేమ్ సాగర్ రావు గుండాయిజం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గుడిపేట, వేంపల్లి గ్రామ సరిహద్దులో సుమారు 276 ఎకరాలలో ఏర్పాటు చేయబో యే ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజల భూముల ను ఎలాంటి నోటిఫికేషన్లు, జీవోలు లేకుండా గుంజుకుంటున్నారని ఆరోపించారు. మంచిర్యాలలో మీడియాపై బహిరంగంగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బెదిరింపులకు పాల్పడు తున్నాడు. కాంగ్రెస్ నాయకుల భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని సవాల్ విసిరారు. పేద దళిత వర్గాలకు చెందిన రైతుల భూముల్లో ఎలా ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తారని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో ఎస్సీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో దళితుల భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, బాధితుల వెంట కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, స్థానిక నేతలు ఉన్నారు.

# ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.

# ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు

## -: పువ్వాడ అజయ్‌కుమార్



హైదరాబాద్, జనవరి 7 :
ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేటీఆర్‌ను అందులో ఇరికించేందుకు ప్రయత్నిస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజంగా కేటీఆర్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షను భరించేందుకైనా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి న్యాయపరంగా పోరాడుదామని కేటీఆర్ చెప్పారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని కేటీఆర్ సూచించారు. కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కాగా,ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చిందన్నారు. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యతంర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు.

# గ్రీన్‌కో కార్యాలయంలో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, జనవరి 7 (ఆర్ఎన్ఎ): మాదాపూర్‌లోని గ్రీన్‌కో కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి ఈ సోదాలు కొనసాగుతున్నాయి. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీ కార్యాలయాల్లోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రూ. 41 కోట్ల ఎన్నికల బాండ్ల కొనుగోలు వ్యవహారంలో అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం, గన్నవరంలోని ఏస్ నెక్ట్స్ జెన్ కార్యాలయాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు

హైదరాబాద్,జనవరి7
కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తాము భయపడేది లేదన్నారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతోని, అక్రమ కేసులతో, అరెస్టులతో తన ప్రభుత్వం తన తప్పిదాలను కప్పిపుచ్చుకోని.. తమను మానసికంగా బలహీన పరుస్తున్నానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు. కానీ కాని తాము మరింత బలంగా పోరాడుతాము తప్ప, మీ అక్రమాలపై, ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నించడం మాత్రం ఆపేది లేదని చెప్పారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో నందినగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పార్టీ నేతలతో కలిసి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదుచేసిందని రాష్ట్ర ప్రజలకు తెలుసున్నారు. రైతుబంధు విషయంలో వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టి, యాసంగి పంటకు కూడా రూ.15 వేలు కాకుండా రూ.6 వేలు మాత్రమే ఇస్తామని చెప్పి రేవంత్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఏడాది పాలన తర్వాత అన్ని సర్వే రిపోర్టుల్లో ప్రభుత్వం ఫెయిల్ అయిందని, రేవంత్ ఫెయిల్యూర్ సీఎం అని తేలింది. దీంతో కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మరల్చాలని రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి అరెస్టయి జైల్లో పడడానికి ఈ కేసుకి పొంతనలేదు. రేవంత్ రెడ్డి డబ్బుల కట్టలతో కెమెరాల ముందు దొరికి జైలుకు పోయాడు. కేటీఆర్ మాత్రం తెలంగాణ కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఈమేజి కోసం ఫార్ములా ఈ రేస్ తీసుకువచ్చాడు. రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం కేటీఆర్ అక్రమ కేసుకి పోల్చడం అంటే మోకాలికి.. బోడి గుండుకి ముడి వేయడమే. ఎన్ని రకాల కేసులు పెట్టిన మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంపై వెనక్కి వెళ్లం. ఎన్ని కేసులు పెట్టినా నువ్వు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేదాకా నీ వెంట పడతాం. అక్రమ కేసులతోనూ, అరెస్టులతోనూ మమ్మల్ని బలహీనపరచాలన్న రేవంత్ రెడ్డి కుట్ర చెల్లదు. ఎన్ని రకాల కేసులు పెట్టినా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం అని హెచ్చరించారు. హైకోర్టులో ఇచ్చిన తీర్పు కేసులో అవినీతి జరిగిందని నిర్ధారించలేదు. కేసులో అవినీతి ఉందని శిక్ష వేసిన తీర్పు కాదు. ప్రభుత్వం అవినీతి జరిగింది అని చెప్పినప్పుడు.. విచారణ చేసుకోమని కోర్టు చెప్పింది. గతంలో కూడా కేటీఆర్ విచారణకు సిద్ధమని చెప్పారు. ఈ అంశంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే అంశంపై మా లీగల్ సెల్ నిర్ణయిస్తుంది. హైకోర్టు తీర్పు కాపీని పూర్తిగా చదివిన తర్వాత లీగల్ సెల్ సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం. నిన్న ఏసీబీ దగ్గరికి కూడా విచారణ ఎదుర్కోవడానికి కేటీఆర్ వెళ్లారు. 9వ తేదీన కూడా ఇచ్చిన నోటీసు మేరకు విచారణకు వెళ్తారు. నిన్న కూడా 45 నిమిషాలు ఆపినా కేటీఆర్ ఓపిగ్గా వేచి చూశారు. కచ్చితంగా విచారణను ఎదుర్కొంటాం అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడం కోసమే కేటీఆర్ ఫార్ములా-ఈ ని హైదరాబాద్‌కి తెచ్చారు. ఇదే రేసును తమ రాష్ట్రాలకు నగరాలకు తీసుకురావడానికి అనేక రాష్ట్రాలు పోటీపడ్డాయి ఒక్క రూపాయి కూడా చేతులు మారినప్పుడు అవినీతి ఎట్లా జరుగుతుంది. రేవంత్ రెడ్డి తప్పిదాలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై ఈ కేసు పెట్టారు. అటెన్షన్ డైవర్షన్ కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. రైతుబంధు ఎగగొట్టడం వల్ల ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటున్నది. అన్ని సర్వే రిపోర్టులు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వస్తున్నాయి. అందుకే మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అటెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. భవిష్యత్తులోనూ తమలాంటి నాయకులపై కేసులు పెడతారని మాకు తెలుసు. ఎన్నో పోరాటాలతోనే త్యాగాలతోని తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్‌కు ముఖ్యం. రేవంత్ రెడ్‌ని కూడా ఫార్ములా-ఈ కంపెనీ ప్రతినిధి కలిసినా ఇప్పటిదాకా బయట పెట్టలేదు. రైతు భరోసాను తగ్గించి ప్రజలకు ఇస్తున్నందుకు.. వారి నుంచి వచ్చే
వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికే ప్రభుత్వం ఈ కేసు పెట్టింది. ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమే. ఎన్ని రకాల కేసులు పెట్టినా, ఎన్ని కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా తెలంగాణ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మేమెప్పుడూ తెలంగాణ ప్రజల పక్షమే. కేటీఆర్‌పై పెట్టిన కేసులు కానీ, పార్టీ నేతలపై పెడుతున్న కేసులను కానీ పార్టీ ఎదుర్కొంటుంది. కేటీఆర్ కడిగిన ముత్యంల బయటకి వస్తారు. ఎలాంటి తప్పు చేయలేదన్న ధైర్యం ఉంది కాబట్టి విచారణకి వెళ్తాం. మాకు అధికారులపై, కోర్టులపై విశ్వాసం ఉంది. కానీ రేవంత్ రెడ్డి పైన లేదు.
కోర్టులో వచ్చిన తీర్పు పైన కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ విచారణ మాత్రమే చేయమని హైకోర్టు చెప్పింది. విచారణ ప్రారంభం కాకముందే తప్పు జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు. కొంతమంది హైకోర్టు తీర్పును తప్పుడుగా వక్రీకరిస్తున్నరు. కేటీఆర్‌పై పెట్టిన కేసు తుఫేల్ కేసు. కోర్టుల్లో నిలబడదు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే చేస్కోనివ్వండి. కోర్టులోనే తేల్చుకుంటాం. అక్రమ అరెస్టులకు మేము భయపడే వాళ్లం కాదు. సమైక్య రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల పైన చిచ్చరపిడుగుల్లా పోరాడిన చరిత్ర మాది. గతంలో అరెస్టయి కేటీఆర్ వరంగల్ జైల్లో ఉన్నారు. గ్రీన్‌కోకి రూపాయి లబ్ది చేయనప్పుడు వారు ఎందుకు మాకు తిరిగి డబ్బులు ఇస్తారు. అదే గ్రీన్‌కో కంపెనీ ఫార్ములా-ఈ రేసు నిర్వహణలో భారీగా నష్టపోయింది ఇలాంటి పరిస్థితుల్లో వారి నుంచి డబ్బులు వచ్చాయనడం అర్ధరహితం' అని హరీశ్ రావు అన్నారు. న్యాయస్థానాలపై మాకు గౌరవం ఉంది. విచారణకు సహకరిస్తాం. ఇప్పటికే విచారణ కోసం కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి కూడా వెళ్లారు. ఈ నెల 9న విచారణకు హాజరవుతారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ప్రజల దృష్టి మరల్చారని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. రైతు భరోసాను రూ.15వేల నుంచి రూ.12వేలకు తగ్గించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే ఆయనపై కేసులు పెడుతున్నారు. ఇంకా చాలా మంది నేతలపై రేవంత్ రెడ్డి కేసులు పెడుతారు. ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాలు, అక్రమ కేసులకు భయపడేది లేదు. అరెస్టులు మాకు కొత్త కాదు. దీనిపై న్యాయవాదుల సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడుతాం. హైకోర్టు తీర్పు కాపీ పూర్తిగా పరిశీలించాక నిర్ణయం తీసుకుంటాం. ఈ కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు' అని హరీశ్ రావు వెల్లడించారు. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో రూపాయి అవినీతి కూడా జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఈ కేసులో న్యాయపరంగా పోరాడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయాలని కేటీఆర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# కుప్పంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**జననాయకుడు పోర్టల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ**

**ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న చంద్రబాబు**



కుప్పం,జనవరి7
మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాలతో సమానంగా.. అవసరమైతే మిన్నగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో 'జననాయకుడు' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు, విజ్ఞప్తులను సీఎం పరిశీలించారు. ప్రతి కౌంటర్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసేలా ఈ పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజలతో పాటు తెదేపా నేతలు, కార్యకర్తలు తమ ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేయవచ్చు. వాట్సప్ ద్వారా కూడా సమాచారం ఇవ్వొచ్చు. వాటిని పోర్టల్‌లో నమోదు చేసి విశ్లేషించి పరిష్కారం చూపుతాం. స్థానిక ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం విషయంలో నాపై ప్రత్యేక బాధ్యత ఉంది. ఇక్కడి ప్రజలు వరుసగా 8 సార్లు గెలిపించారు. సీఎంగా ఉన్నందున అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఏ అర్జీ వచ్చినా నిర్దిష్ట సమయంలో పరిష్కార మార్గం చూపిస్తాం. ఇది వినూత్న ప్రయోగం' అని చంద్రబాబు అన్నారు. స్వర్ణ కుప్పంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబిగాని పల్లి, తంబి గానిపల్లి గ్రామంలో 41.22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.105.10 కోట్ల వ్యవయంతో ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 4800 మందికి ఉపాధి దిశగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ ద్వారా 50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి.. సీఎంకు వివరించారు.అలాగే శాంతిపురం మండలం ఐపీ తంబి గానిపల్లి, తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏపీఐఐసీ ద్వారా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ)కి భూమిని కేటాయించారు. దాదాపు రూ.233 కోట్లతో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగస్వామ్యంగా ఉన్నారని ముఖ్యమంత్రికి సీఈఓ తిమ్మప్ప, చైర్మన్ శ్రీదేవి వివరించారు. ఒకే రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్వహణ, అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యవయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీకే పల్లి పార్కుల అభివృద్ధి, సుందరీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధిలో రోడ్డు జంక్షన్లు, వీధి దీపాలను ప్రత్యేక గ్రాంట్లతో రూ.60.20 కోట్ల అంచనా వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు. అలాగే రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజకవర్గంలోని 451 డ్రైనేజీ వర్కులను, జీఎస్ హెచ్11- ఎస్‌డీపీ నిధుల ద్వారా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు.

# తలచకుంటే గాంధీభవన్ పునాదులు ఉండవు

## ఘాటుగా హెచ్చరించిన బండి, ఏలేటి.,ధర్మపురి

హైదరాబాద్,జనవరి7
బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని బిజెపి తీవ్రంగా ఖండించింది. పార్టీ నేతలు ఈ దాడిని తీవ్రంగా తీసుకున్నారు. తాము తలచుకుంటే గాంధీభవన్ ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదా తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దన్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ.. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నానన్నారు. బీజేపీ కార్యాలయం పై కాంగ్రెస్ దుండగులను పంపించి దాడులు చేశారని, కార్యకర్తల తలలు పగలగొట్టారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వ ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. ఏం చెప్పాలని అనుకుంటున్నారు.. ఏమిటి ఈ సంస్కృతి.. రాష్ట్రానికి హోంమంత్రి లేరు.. సీఎం ఏం చెప్పాలని అనుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ దీనికి బాధ్యత వహించాలని, మహేష్ కుమార్ గౌడ్ వి చిల్లర చేష్టలు అని ఆయన ధ్వజమెత్తారు. దాడికి బాధ్యత వహించి మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేయాలని, హోం మంత్రి సీఎం చేతుల్లో ఉంది ఆయన రాజీనామా చేస్తారా ? అని ఆయన దుయ్యబట్టారు. దీంతోపాటు.. ఫార్ములా ఈ రేసు కేసు గురించి మాట్లాడుతూ.. కేటీఆర్ అధికారుల ప్రమేయం ఉందని అంటున్నారని, అధికారులను కేటీఆర్ బెదిరించారన్నారు. కేటీఆర్ నిర్దోషి ఐతే నిలబడి ఎదుర్కోవాలని, వాస్తవాలను బయటపెట్టాలన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు మహేశ్వర్ రెడ్డి. ఈ పరిస్థితులపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మీ జాతీయ నాయకులు ఎక్కడికి దాక్కుంటారో' అని ప్రశ్నించారు. అదే సమయంలో, తెలంగాణలో అవినీతి విషయాలపై ఆయన తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'కేటీఆర్ ఎంతకాలం తప్పించుకుని తిరుగుతారు? చంచల్‌గూడ జైలుకు వెళ్లాలా లేక తీహార్ జైలుకు వెళ్లాలా అనేది కేటీఆర్ నిర్ణయించుకోవాలి. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. ప్రజల డబ్బును దోచుకుని కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. బీజేపీ మాత్రం తెలంగాణలో త్వరలో అధికారంలోకి వస్తుంది,' అని ధర్మపురి భరోసా వ్యక్తం చేశారు. తెలంగాణలో పాలనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల విధానాలను విమర్శిస్తూ, బీజేపీ తన రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టంగా పేర్కొన్నారు.

# బిజెపి కార్యాలయంపై దాడిని ఖండించిన పిసిసి

**ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదన్న మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్,జనవరి7 : బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిపైన టీపీసీసీ సీరియస్‌గా స్పందించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేపట్టడం అవసరం అయినా, రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడికి వెళ్లడం సరైంది కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రియాంక గాంధీపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, యూత్ కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు పాల్పడడం తగదని ఆయన అన్నారు. యూత్ నేతలను పిలిచి వారిని మందలించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బీజేపీ నేతలు కూడా ఇలాంటి దాడులు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నా అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య సంస్కృతి కాపాడాలని, శాంతి భద్రతల విషయంలో బీజేపీ నేతలు సహకరించాల్సిన అవసరం ఉందని కూడా మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో దాడులు పద్ధతి కాదన్నారు.

# ప్రియాంకగాంధీపై బిజెపి నేత అనుచిత వ్యాఖ్యలు

**పరస్పర దాడులకు తెగబడ్డ కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు**

**నాంపల్లి బిజెపి కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి**

**ప్రతిగా గాంధీభవన్‌పై దాడికి దిగిన బిజెపి శ్రేణులు**

**రంగంలోకి దిగి చెదరగొట్టిన పోలీసులు**

హైదరాబాద్,జనవరి7
బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడులతో హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని ఈ రెండు పార్టీ ఆఫీసుల వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ కాల్కాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతోంది. రమేష్ బిదురి వ్యాఖ్యలకు నిరసనగా, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కేంద్ర మంత్రులను అడ్డుకోవాలని యూత్ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేసి, రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ దాడిలో ఓ బీజేపీ కార్యకర్త తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి ప్రతిగా, కోపోద్రికులైన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలపై కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించడంతో, ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తరవాత బిజెపి కార్యకర్తలు దాడికి దిగడంతో గాంధీ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ భవన్ ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెద్దఎత్తున గాంధీ భవన్ వద్దకు చేరుకున్న కాషాయం కార్యకర్తలు అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చింపివేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున ఘర్షణ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. తెలంగాణలో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నారు. దాడి అనంతరం, బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ పోలీసులు అప్రమత్తమై బీజేపీ శ్రేణులను అడ్డుకోవడంతో, గాంధీభవన్ వైపుగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో, బీజేపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేస్తుండగా, పోలీసులు వారిని
నియంత్రించేందుకు లాఠీచార్జ్ చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు, ఈ ఘటన తర్వాత బీజేపీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు చేరుకుని నిరసనలు వ్యక్తం చేసారు.

# సతీసమేతంగా ఆమ్‌ఆద్మీ పార్టీలోకి బీఎస్పీ నేత

న్యూఢిల్లీ, జనవరి 7
దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో వివిధ పార్టీల్లో చేరికలు, రాజీనామాలు జోరందుకున్నాయి. తాజాగా ఢిల్లీకి చెందిన బీఎస్పీ నేత మదన్ మోహన్ తన భార్య సుధేశ్వతితో సహా అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ సమక్షంలో వారు ఆ పార్టీలో చేరారు. సంజయ్ సింగ్ వారికి స్వయంగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ దంపతులు సంజయ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చారు. కాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అంతటా ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. మంగళవారం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

# ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, జనవరి 7
ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు. ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిని రేప్ చేసిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు.జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో రేప్ కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్లు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి.

# కిమ్స్‌లో శ్రీతేజకు పుష్ప పరామర్శ

## -నిర్మాత దిల్‌రాజ్‌తో కలసి ఆస్పత్రికి రాక

హైదరాబాద్,జనవరి7
: సినీ నటుడు అల్లు అర్జున్ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి లోపలికి వెళ్లారు. సుమారు 20 నిమిషాల పాటు ఆస్పత్రిలో ఉన్న అల్లు అర్జున్.. వైద్యులతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తోనూ మాట్లాడారు. మరోవైపు ఆస్పత్రి వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదైన నేపథ్యంలో పరామర్శకు వెళ్లొద్దని లీగల్ టీమ్ చెప్పడంతో శ్రీతేజ్ వద్దకు రాలేదని ఇటీవల అల్లు అర్జున్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. తాజాగా పోలీసులకు సమాచారం ఇచ్చిన తర్వాత కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించారు. గత నెల 4న 'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆ బాలుడిని కిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే రేవతి కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, దర్శకుడు సుకుమార్ ఆర్థికసాయం ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.కోటి, పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షల చెక్కులను ఇటీవల దిల్ రాజు ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు.

# సంక్రాంతి రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు

**రానూపోనూ బుక్ చేసుకుంటే పదిశాతం రాయితీ**

**ఎపిఎస్ ఆర్టీసి ప్రకటన**

అమరావతి,జనవరి7(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండగ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏపీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. జనవరి 8 నుంచి మొదలు 13 వరకూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఎండీ పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలుండవని, సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తామన్నారు. ఒకేసారి రెండు వైపులా టికెట్లు బుక్ (చేసుకుంటే టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో ఊరట

**-బెయిల్ పిటిషన్ విచారణ 20కి వాయిదా**

అమరావతి,జనవరి7 :
ఏపీలో సంచలనం సృష్టించిన బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి పేర్నినాని వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను ఈనెల 20కి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటి వరకు తొందరపాటు చర్యలు వద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రేషన్ బియ్యం అమ్ముకున్న ఘటనలో ఏ6గా పేర్నినాని ఉండగా, ఏ1గా పేర్నినాని సతీమణి జయసుధ ఉన్నారు. గోడౌన్ మొత్తం కూడా జయసుధ పేరుమీద ఉండటంతో మొదటి నుంచి ఈ కేసులో జయసుధ ఉన్నారు. అయితే ఏ6గా పేర్నినాని చేర్చారు పోలీసులు. ఈ విషయం తెలిసిన వెంటనే పేర్నినాని హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న ఈ కేసుపై విచారణ జరుగగా.. నేటికి వాయిదా వేసింది హైకోర్టు. ఈరోజు మరోసారి పేర్నినాని పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం.. జనవరి 20 (సోమవారం) వరకు ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# డాన్ బోస్కో మాసంలో సాంస్కృతిక కార్యక్రమాలు




**చండూర్ జనవరి 7 (శాసనసభ న్యూస్):** నల్గొండ జిల్లా చండూర్ మున్సిపాలిటీ కేంద్రంలో డాన్ బోస్కో జూనియర్ కళాశాలలో జనవరి 31న డాన్ బోస్కో పండగ సందర్భంగా బోస్కో మాసం కార్యక్రమాలను కరస్పాండెంట్ ఫాదర్ రాజేష్ పావురం ను ఎగురవేసి, క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ రాజేష్ మాట్లాడుతూ 2 శతాబ్దాల క్రితం డాన్ బోస్కో జననం తో ఏర్పాటయిన డాన్ బోస్కో సంస్థలు యువతకు విద్యను ఉపాధిని మార్గదర్శకం ను చూపిస్తూ వారికి మెరుగైన జీవితాలను ప్రసాదిస్తుంది అని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి రెడ్డి మాట్లాడుతూ డాన్ బోస్కో వర్ధంతి సందర్భంగా ఈ మాసములో విద్యార్థులకు ఆటలు, పాటలు, కళలు , సాహిత్యం వంటి వివిధ రంగాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుంది. విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటుకోవాలని కోరారు. అదేవిధంగా మంగళవారం రోజు డాన్ బోస్కో దిశా సంస్థ కో ఆర్డినేటర్ ఫాదర్ జస్టిన్ కెరియర్ అండ్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించి ఇంటర్ విద్య తరువాత ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించడమైనది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పీ అంజయ్య డిమాండ్



**యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 07):.** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పి అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అనంతరం ఆయన మాట్లాడుతూ.. నంది వనపర్తి, సింగారం, తాడిపర్తి, కురుమిద్ద గ్రామాలలో 1400 ఎకరాల సాగు చేసుకుంటున్న రక్షిత కవులు దారులకు రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తి చేసుకున్న ప్రతి కూలీకి లింకులు పెట్టడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ఇండ్ల స్థలం లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ప్రభుత్వమే ఇప్పించాలని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఇండ్లు లేక, రేషన్ కార్డు లేక, అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం లాగే మాటలే తప్ప.. చేతలలో లేదని ఎద్దేవేశారు. ఇప్పటికైనా కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి వెంటనే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల మండల కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు

# నేడు విద్యుత్ సరపరాలో అంతరాయం



**ఆదిభట్ల శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 7**
33/11కె.వి ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి కప్పాడు ఏజిల్ ఫీడర్ మీద లైన్లకు తాకే చెట్ల కొమ్మలు తొలగించడం బుధవారం (నేడు)జరుగుతుంది.కావున ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 04:00వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగునుంది.దీనికి సంబంధించి కప్పాడు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును.కావున ఈ విషయాన్ని గమనించి ప్రజలు, వ్యాపారస్తులు, రైతుసోదరులు విద్యుత్ సిబ్బందికి సహకరించగలరని ఆదిభట్ల ఏ. ఈ జయన్న కోరారు.

# బల్మూరి వెంకట్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన అబ్బాస్



**చండూర్ జనవరి 7 (శాసనసభ న్యూస్):**
గట్టుప్పల్ మండలం మాజీ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ ఎమ్ ఎల్ సి బల్మూరు వెంకట్ ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవు -ఎస్ఐ కాశినాథ్

జహీరాబాద్ శాసనసభ న్యూస్ జనవరి 7
సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగి అమ్మకాందారులు తెలంగాణ ప్రభుత్వం ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 సెక్షన్ 5 ప్రకారం చైనా మాంజాను నిషేధించడం జరిగిందని పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ కాశినాథ్ పేర్కొన్నారు. చైనా మాంజను అమ్మినచో చట్టం ప్రకారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేసారు. అంతేకాకుండా వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 సెక్షన్, 51 ప్రకారం ఏడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ నిషేధించబడిన చైనా మాంజను ఎవరు కూడా అమ్మకూడదని, అమ్మినచో చట్టరీత్యా నేరం అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఏ షాప్ లో నైనా చైనా మాంజదారం అమ్మినచో 8712656763 నెంబర్ కు తెలియపరచాలని కోరారు.

# ఎమ్మెల్యే సోదరులను కలిసిన డాక్టర్ అశోక్ ఉక్కుల



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 7**
కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ఉక్కుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డిని, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డౌవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డిని మంగళవారం నాడు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోకటి కిరణ్, మంద మహేందర్, మోహన చారి, రామకృష్ణ, సయ్యద్ అబ్దుల్ కవి, నాగార్జున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి గుండాల్లాగ ప్రవర్తిస్తూ బీజేపీ కార్యాలయంపై దాడి:

### - బీజేపీ నాయకులు బోసుపల్లి



తుర్కయంజాల్, జనవరి 07(శాసన సభ ):
బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేదంటే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ప్రభుత్వాన్నిరాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసువల్లి ప్రతాప్ అన్నారుడిమాండ్ చేశారు.మంగళవారం ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వీధి గుండాల్లాగ ప్రవర్తిస్తూ బీజేపీ కార్యాలయంపై దాడీకి దిగడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.అసమర్ధ పాలన నుండి ప్రజల దృష్టి మరల్చడానికే బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్త లు దాడి చేశారని అయన అన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నాం

### -బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడ్డటి మధు యాదవ్



**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 7**
శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడో విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొడ్డటి మధు యాదవ్ అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయం పై జరిగిన దాడితో విఫలమైన విషయాన్ని చాలాస్పష్టంగా ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు.హెూం మినిస్ట్రీని చేతిలో ఉంచుకుని బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ గుండాలు కర్రలతో దాడికి పాల్పడుతుంటే ఆనందంగా తిలకిస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇంతవరకు స్పందించకపోవడం చాలా శోచనీయమని,
కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్నా పేరు మీద బిజెపి కార్యాలయం పై దాడిచేయడం జరిగిందన్నారు. వెంటనే దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులకు అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయడం అలవాటుగా మారిందని, కాంగ్రెస్ పార్టీదాడికి ప్రతి దాడి తప్పదని యువమోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దాడి చేసిన నాయకులకు వెంటనే అరెస్టు చేసి హత్యాయత్నం కేసులు పెట్టాలని మధు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం :

### -నకిరేకంటి లింగస్వామి గౌడ్



చండూర్ జనవరి 7 (శాసనసభ న్యూస్):
బీజేపీ నల్గొండ జిల్లా అధికార ప్రతినిధి నకిరేకంటి లింగస్వామి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం, నాంపల్లి వద్ద కాంగ్రెస్ గూండాలు బీజేపీ కార్యకర్తలపై దాడికి పాల్పడడం తీవ్రంగా ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి రౌడీయిజానికి తావులేదు. బీజేపీ కార్యకర్తల రక్తపు ప్రతి బొట్టుకూ జవాబుదారీగా కాంగ్రెస్ పార్టీ నిలవాల్సి ఉంటుంది. మా కార్యకర్తలపై దాడి చేసి భయపెట్టాలని చూసే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ అనైతికత, బలహీనతలకు నిదర్శనం.మా కార్యాలయం కేవలం ఒక భవనం కాదు, అది లక్షలాది కార్యకర్తల కృషి, త్యాగాలకు ప్రతీక. ఈ దాడి ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది.
అధికారులు వెంటనే చర్యలు తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, రౌడీయిజాన్ని అంతమొందించటానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని
అన్నారు.

## ఆదిభట్ల అభివృద్దే ప్రధాన లక్ష్యం

**ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 7**
ఆదిభట్ల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతూ అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సుమారు 75 లక్షల రూపాయలతో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను మంగళవారం నాడు పరిశీలించి నాణ్యతను పాటించాలని అధికారులను కోరారు. అభివృద్దే లక్ష్యంగా అనునిత్యం శ్రమిస్తూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ సత్వరమే సమస్యలను పరిష్కరిస్తున్నందున మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి నిరంజన్ రెడ్డికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు



# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### -మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు-బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి

### -దివ్యాంగులకు 150 మందికి దుప్పట్లు పంపిణీ -వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య





**యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 07):.** దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిల్లా కంటి శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వికలాంగుల కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా సత్యసాయి సంస్థల సహకారంతో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సహాయ పరికరాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు కాల జంగయ్య హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలు ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని అన్నారు. దివ్యాంగులకు 100 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నేతలను కోరారు. కొత్త పింఛన్లు పెంచాలని, దివ్యాంగుల భవనానికి ఐదు లక్షలు కేటాయించాలని కోరారు. దివ్యాంగులకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ నేతల సహకారం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నర్సింగ్ రావు, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, వికలాంగుల మండల అధ్యక్షుడు దేరంగుల ఈశ్వర్, సత్య సాయి సేవ సంస్థల జిల్లా నాయకులు దినవన్ రావు, కొమ్ము రాములు, మహమ్మద్ సలీం, యాదయ్య, మద్దెల బాలరాజు, ఆకుల సంజీవ, కంబాలపల్లి జంగయ్య, నల్లవెల్లి పోచయ్య, మాజీ ఉపసర్పంచ్ నెర్రె భాష, తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు నిరంతరం ప్రజా సేవకుడు

### -మాజీ సర్పంచ్ రాజ్ నాయక్ కు డాక్టరేట్

### -ఆయనకు శాలువాతో సత్కారం



**యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 07):.** మండల పరిధిలో నంది వనపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాజు నాయక్ నిరంతరం ప్రజలకు సేవకుడు, ఆయనను గుర్తించి డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. సంపాదించిన సంపదలో సగం ప్రజలకి సహాయం చేస్తుంటాడు. నిత్యం ప్రజలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండే నాయకుడని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు మండలి గోపాల్, సభావత్ కిషన్ నాయక్, సభావత్ లక్ష్మణ్, సపవత్ వినోద్, పాపయ్య, నక్క గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరిగేలా నిబంధనలు సరళతరం చేస్తున్నాం



**బిల్డర్లు,డెవలపర్లు నిబంధనలు పాటించి ప్రభుత్వానికి సహకరించాలి -రెండు రోజుల్లో భవన నిర్మాణాలకు కొత్త రూల్స్ జారీ చేస్తాం**

**రెరా,టీడీఆర్ ల పెండింగ్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరిస్తాం**

**ఏపీ రెరా లో గ్రీవెన్స్ స్పెషల్ డ్రైవ్ తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి నారాయణ**

(అమరావతి
రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది సీఎం లక్ష్యమని...దానికనుగుణంగానే నిబంధనలు సరళతరం చేస్తున్నామన్నారు మంత్రి నారాయణ...రెరాలో అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మంత్రి నారాయణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.విజయవాడ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్ లో ఉన్న రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కార్యాలయంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి,రెరా ఛైర్మన్ కన్నబాబు,రెరా సభ్యులు, అధికారులతో కలిసి మంత్రి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.క్రెడాయ్,నరెడ్కో ప్రతినిధులతో పాటు బిల్డర్లు,డెవలపర్లు,ప్రజల నుంచి మంత్రి నారాయణ స్వయంగా వినతులు స్వీకరించారు...ప్రతి దరఖాస్తుకు సంబంధించి పూర్తిగా వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పెండింగ్ లో ఎందుకు పెట్టాల్సి వచ్చిందో అధికారులను వివరణ అడిగారు మంత్రి...ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

**బిల్డర్లు,డెవలపర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి**

భవనాలు,ప్లాట్లు కొనుగోలుచేసేవారు ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండేలా చూడటమే రెరా లక్ష్యం అన్నారు మంత్రి..కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్రంలో 2016లో రెరా చట్టం అమల్లోకి వచ్చింది...అప్పటి నుంచి కేంద్రం ఇచ్చిన నిబంధనలు రాష్ట్రంలో తూ,చ.తప్పకుండా అమలుచేసేలా ముందుకెళు_న్నామన్నారు...రెరాలో ఇప్పటివరకూ 167 దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్నాయి..కొన్ని దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని ఫిర్యాదులు వచ్చాయి...దీంతో ఈ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం..రాష్ట్రం నలుమూలల నుంచి 30 మంది క్లయింట్లు,బిల్డర్లు,డెవలపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు...ఆయా దరఖాస్తుల కు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసాం..పెండింగ్ అప్లికేషన్లు అన్నీ ఈ నెలాఖరులోగా క్లియర్ చేస్తాం.ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధానాలను కూడా కొన్ని పరిశీలించాం...అయితే రెరా నిబంధనలు మరింత సరళతరం చేసేలా కమిటీ వేసి ముందుకెళ్తామన్నారు మంత్రి...రెరా అనుమతులు ఆఫ్ లైన్ లో కాకుండా ఆన్ లైన్ లో జరిగేలా త్వరలో మార్పులు చేస్తున్నామన్నారు మంత్రి.167 దరఖాస్తు లు పెండింగ్‌లో ఉండగా ఈనెలాఖరుకు పరిష్కరించాలని ఆదేశించాం...గత ప్రభుత్వంలో బిల్డర్లు,డెవలపర్లుతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారన్నారు...రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పెరగాలనేది సీఎం చంద్దరబాబు లక్ష్యమని...అందుకు అనుగుణంగా భవన,లేఅవుట్ల అనుమతులను సరళతరం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు..భవన నిర్మాణాలకు సంబంధించి కొత్తగా రూపొందించిన నిబంధనలను వచ్చే గురువారం జారీ చేస్తామని మంత్రి చెప్పారు...బిల్డర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

**ఈనెలాఖరులోగా పెండింగ్ టీడీఆర్ బాండ్లు అన్నీ జారీ చేస్తాం**

తణుకు,తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరగడంతో వాటితో పాటు కొన్నాళ్లపాటు అన్నిచోట్లా బాండ్ల జారీ నిలిపివేసాం...తాజాగా ఒకట్రెండు చోట్ల మినహా మిగిలిన అన్నిచోట్లా పెండింగ్ లో ఉన్న టీడీఆర్ బాండ్లను జారీ చేస్తున్నామన్నారు...గత మూడు రోజులుగా ప్రతి రోజూ అన్ని మున్సిపాల్టీల కమిషనర్ లతో టీడీఆర్ బాండ్ల జారీపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు...తణుకులో టీడీఆర్ కుంభకోణంపై విచారణ పూర్తయిన తర్వాత సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు...ప్రస్తుతం రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వాటిలో 321 టీడీఆర్ ల వెరిఫికేషన్ పూర్తయిందని....మరో 501 టీడీఆర్ ల వెరిఫికేషన్ జరగాల్సి ఉందన్నారు..విశాఖపట్నంలో 184,తిరుపతిలో 153,కర్నూలు లో 93,గుంటూరులో 120,కాకినాడలో 91,రాజమండ్రిలో 50,కడపలో 46,విజయవాడలో 30తో పాటు ఇతర కార్పొరేషన్ లలో మరికొన్ని పెండింగ్ లో ఉన్నాయన్నారు.మొత్తంగా 822 టీడీఆర్ లకు సంబంధించి ఈనెలాఖరుకల్లా జారీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు మంత్రి నారాయణ.

**బీపీఎస్,ఎల్ ఆర్ ఎస్ లపై కోర్టు ఆదేశాలపై అధ్యయనం చేస్తున్నాం**

రాష్ట్రంలో అనధికారిక లే అవుట్లు చాలా వరకూ ఉన్నాయన్నారు మంత్రి నారాయణ...ఎక్కడెక్కడ ఎన్నెన్ని అక్రమ లే అవుట్లు ఉన్నాయనే దానిపై ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చిందన్నారు...అలాంటి అనుమతులు లేని లే అవుట్ల లో ప్లాట్లు కొనడం ద్వారా కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడతారన్నారు.మరోవైపు భవన,లేఅవుట్ల క్రమబద్దీకరణపై కోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

# జీవితకాల జ్ఞాపకం

(గోపాలపురం నియోజకవర్గం బహుజన టైమ్స్ ప్రతినిధి)సరిగ్గా ఐదేళ్ళ క్రితం ఇదే రోజు(07 %జీుఅ% 2020) ఆయనతో వెళ్తూ బస్సులో కొన్ని అంశాలు ప్రస్తావించడం, వాటిమీద విశ్లేషించడం జరిగింది, ఒక రకంగా అవి నాకొచ్చిన ఆలోచనలు మాత్రమే..

నేను చెప్పిన వాటిల్లో సరైన వ్యూహంలేదు, లాజిక్ లేదు, ఏమీ లేకపోయినా నాకు మాత్రం చాలా మంది లాగే, ఈ ప్రపంచంలో ఎవ్వరికి రాని గొప్ప ఆలోచనేదో నాకే వచ్చినట్లు, ఈ గొప్ప ఆలోచనతో మొత్తం పార్టీ దిశానిర్దేశమే మారిపోద్ది అని నా ఫీలింగ్. ఆయన ఓపిగ్గా వినే తీరు చెప్పేవారికి మరింత ఉత్సాహాన్నిస్తుంది. అంతా విన్న తర్వాత “బాగుంది రాజు, ఇంకొంచెం డిటైల్ గా ప్రిపేర్ చెయ్యి” అని ఉత్సాహపరిచారు. అది ఆయన గొప్పతనం, నిజానికి అప్పుడు నేను ఆయనకు ప్రెజెంట్ చేసినది ఇప్పుడు గుర్తుతెచ్చుకుంటుంటే నా మీద నాకే జాలేస్తుంది, ఎందుకంటే ముందే చెప్పాగా నేను అప్పుడు చెప్పిన వాటిల్లో సరైన వ్యూహంలేదు, లాజిక్ లేదు అని...తర్వాత, తర్వాత ఆయన నన్ను తీర్చిదిద్దిన తీరు అమోఘం.

మట్టి ముద్దకు రూపమిచ్చి జీవం పోసారు.

ప్రతీ విషయాన్ని ఏ దృక్పదంతో చూడాలి(?), దాని సామాజిక కోణం ఏమిటి (?)

–రాజకీయ కోణం ఏమిటి (?),

రాజకీయ వ్యూహాలు ఎలా ఉండాలి (?),

వ్యూహాల అమలు తీరు (?),

సంక్షోభంలో ఎలా ఆలోచించాలి (?),


సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలి (?),

సామాజిక సృహ, సామాజికవర్గాల సమీకరణ...

ప్రజలు వారి జీవనం, పాలసీల నిర్మాణం .....

ఎత్తుకు పై ఎత్తులు, కుట్రలు చేదించడం...

ప్రణాళికలు, వాటికి సాంకేతికత జోడించడం...




ఇలా అన్ని విషయాల్లో రాటు తేలేలా తయారు చేసారు. ఒక రకంగా చెప్పాలంటే నా అంత అదృష్టవంతులు, నా కొచ్చినంత గొప్ప అవకాశం ఇంకెవ్వరికి రాదేమో.

మీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



## SPADEX డాకింగ్

# ఆపరేషన్ వాయిదా..

## - ప్రకటించిన ఇస్రో

అంతరిక్షంలో స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్(%ూజూఖవశ%) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలో అనుసంధానం చేసే ప్రయోగాన్ని ఇస్రో చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే పీఎస్ఎల్వీ-సీ60 ద్వారా 440 కిలోల బరువున్న రెండు ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలోకి పంపింది. తాజాగా, ఈ పరీక్షకు సంబంధించి ఇస్రో కీలక ప్రకటన చేసింది. SpaDeX డాకింగ్ ఆపరేషన్‌ను 2025, జనవరి 9కి రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. సోమవారం(జనవరి 6) గుర్తించిన అబార్ట్ దృష్టాంతం ఆధారంగా గ్రౌండ్ సిమ్యులేషన్స్ ద్వారా డాకింగ్ ప్రక్రియకు మరింత ధ్రువీకరణ అవసరమని ఇస్రో పేర్కొంది. అంతకుముందు ఈ డాకింగ్ ఆపరేషన్‌ను జనవరి 7న ప్లాన్ చేసినట్లు ఇస్రో తెలిపింది. తాజాగా ఆ గడువును రెండు రోజులు పొడిగించింది. %ఔ్రాూణజు౹శ% ఆన్‌బోర్డ్ వీడియోను ఇస్రో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.

## పోచారం శ్రీ మల్లన్న జాతర మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పృథ్వీరాజ్

పటాన్చెరు
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని పోచారం గ్రామంలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం ప్రత్యేక గుర్తింపును కలిగి ఉంటుంది. ఈ జాతర ఉత్సవానికి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఈ ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందుతారు అని, ఆలయ పరిసరాలలో భక్తి గీతాలు, సేవా కార్యక్రమాలు, మరియు వివిధ సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణ యాదవ్ అతిథిని సన్మానించి ఆయనకు గుర్తుగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం గ్రామస్థులు, భక్తుల సమక్షంలో జాతర ఉత్సవానికి మరింత శోభాన్నిచ్చింది అని పృథ్వీరాజ్ అన్నారు.





## డ్రైనేజీ పూడిక తీసివేత పనులు పరిశీలించిన కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి సర్పంచ్ రామాంజనేయులు

పెద్దకడబూరు మండలంలో లక్ష్మీపేటలో పూడిక పనుల ముగించి ప్రధాన రహదారి వెంబడ డ్రైనేజీ పూడిక పనులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్ నందు రెండవ రోజు డ్రైనేజ్ పూడిక తీసి వేయించారు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి. గ్రామ సర్పంచ్ ఎం రామాంజనేయులు మాట్లాడుతూతీసివేసిన పూడికను. ఎస్ డబ్ల్యూపిసీ షెడ్ కు తరలించాలని కార్మికులకు ఆదేశించారు.అలాగే దయచేసి గ్రామ ప్రజలు కూడా తమ ఇంటీ ముందు ఉన్న డ్రైనేజ్ మీద ఉన్న బండలను తీసేందుకు సహకరిస్తే. డ్రైనేజీ పూడిగా తీసివేయడానికి సులభతరం అవుతుంది.తెలిపారు.పంచాయతీకి సహకరించాలని అన్నారు. గ్రామ ప్రజలకు తెలియజేశారు.

## నామినేటెడ్ పోస్టులపై లోకేశ్ కీలక వ్యాఖ్యలు



(ఆంధ్రప్రదేశ్
కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు పర్యాయాలు ఒక పదవిలో కొనసాగిన తర్వాత ఉన్నత పదవికైనా వెళ్లాలి.. లేదా ఓ విడత ఖాళీగా అయినా ఉండాలని లోకేశ్ వ్యాఖ్యానించారు. పార్టీ నిర్ణయం తీసుకుంటే కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, తాను కూడా పదవి తీసుకోకుండా సామాన్య కార్యకర్తలుగా పనిచేయాలన్నారు. నెల రోజుల్లో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని లోకేశ్ తెలిపారు.

## ఎమ్మెల్యే రామాంజనేయులు, పత్తికొండ డి.ఎస్.పి వెంకటరామయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన పారిశ్రామికవేత్త టిడిపి సీనియర్ నేత రాజా గౌడ్.



(ఆలూరు
ప్రముఖ పారిశ్రామికవేత్త సీనియర్ నాయకుడు రాజా గౌడ్ పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు పత్తికొండ డి.ఎస్.పి వెంకట్రామయ్యను శాలువాతో, పూలమాలతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో తెలుగు యువతా జిల్లా అధికార ప్రతినిధి నాయకుడు సురేంద్ర నాయుడు వార్తాబలం రిపోర్టర్ సుధాకర్ తెలుగుదేశం సీనియర్ నాయకులు అలేఖ్య హొటల్ విజయ్ లింగంపల్లి శేషగిరి లింగంపల్లి హనుమంత రాయుడు స్వామి తదితరులు పాల్గొన్నారు

# బీజీటీలో షమీ ఉంటే లెక్క వేరే ఉండేది



**షమీని ఆసీస్ టూర్ కు తీసుకొస్తే బాగుండేది**

**బీసీసీఐపై మాజీ కోచ్ రవి శాస్త్రి ఆగ్రహం**

ప్లేయర్ల ఫిట్ నెస్ పై బీసీసీఐ వ్యవహార ధోరణిని మాజీ కోచ్ రవి శాస్త్రి కడిగిపారేశాడు. ముఖ్యంగా స్టార్ పేసర్ మహ్మద్ షమీ.. గాయం కారణంగా సుదీర్ఘంగా క్రికెట్ కు దూరంగా ఉండటం ఏంటని ప్రశ్నించాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ఇన్నాళ్లుగా షమీతో ఏం చేస్తున్నారని అడిగాడు. నిజానికి బోర్డర్– గావస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు తోడుగా షమీ ఉంటే కథ వేరేగా ఉండేదని చాలామంది అభిప్రాయ పడ్డారు. సిరీస్ సగం ముగిసిన తర్వాత షమీని పిలిపించాలని కూడా డిమాండ్లు వెల్లువెత్తాయి. అయితే బీసీసీఐ ధోరణితో ఆటగాళ్ల పునరావాసంపై ప్రశ్నలు రేకెత్తుతున్నాయని శాస్త్రి విమర్శించాడు. ఆటగాళ్ల గాయాల అప్డేట్ పై ఇంత గోప్యం ఎందుకని, ఎప్పటికప్పుడు అప్డేట్ ఇవ్వాలని సూచించాడు. నిజానికి 2023 ప్రపంచ కప్ వన్డే ఫైనల్ తర్వాత చీలమండ గాయంతో షమీ జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత ఏడాది తనకు శస్త్ర చికిత్స కూడా జరిగింది. అప్పటి నుంచి షమీ కోలుకుంటూనే ఉన్నాడు. జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసం పొందుతున్నాడు. అయితే రిహాబిలిటేషన్ ను జట్టుతో పాటే కొనసాగించి ఉంటే బాగుండేదని శాస్త్రి అభిప్రాయ పడ్డాడు. అతడిని టీమిండియాతో పాటు ఆసీస్ టూర్ కు తీసుకొచ్చి, ఎప్పటికప్పుడు మోనిటర్ చేస్తే మంచి ఫలితాలు ఉండేవని వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ ఫిజియోలతో కలిసి ఈ విషయంలో ఇంకాస్త మెరుగ్గా వర్కౌట్ చేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నాడు. షమీ లేని లోటు బీజీటీలో స్పష్టంగా కనిపించిందని వ్యాఖ్యానించాడు. బుమ్రాకు తోడుగా అతనుంటే ఫలితాలు వేరేగా వచ్చేవని పేర్కొన్నాడు. ఇక షమీ లేని లోటుతో బౌలింగ్ భారం బుమ్రా, సిరాజ్ లపైనే పడింది. ఇద్దరు సిరీస్ లో చెరో 150కిపైగా ఓవర్లు బౌలింగ్ చేశారు. ఇక ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అయితే ఒక అడుగు ముందుకేసి నాలుగో టెస్టు నుంచి షమీని ఆడిస్తే బాగుండేదని వ్యాఖ్యానించాడు. అప్పటికే జట్టులో బుమ్రా, సిరాజ్ ఉన్నారని వారికి తోడుగా షమీ ఆడేవాడని, రోజుకు కొన్ని ఓవర్లు చొప్పున అతడితో బౌలింగ్ వేస్తే బాగుండేదని, నితీశ్ రెడ్డి రూపంలో బ్యాకప్ పేసర్ కూడా అందుబాటులో ఉన్నాడని గుర్తు చేశాడు. ఈ సిరీస్ లో సిరాజ్ ఎంతో కష్టపడినప్పటికీ, అతనికి లక్కు కలిసి రాలేదని పేర్కొన్నాడు. అదే షమీ కూడా తోడుంటే టీమిండియాకు చాలా హెల్ప్ అయ్యుండేదని, బుమ్రా కూడా మధ్యలో గాయాల బారిన పడకుండా షమీ సలహాలు ఇచ్చేవాడని వ్యాఖ్యానించాడు. ఏదేమైనా టీమ్ మేనేజ్మెంట్ తప్పుడు ప్రణాళికలకు మూల్యం చెల్లించుకుంది. ఐదు టెస్టుల సిరీస్ ను 1–3తో చేజార్చుకుంది. దీంతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది.

# భారత్‌లో అభిమానులు చాలా క్రేజీగా ఉంటారు

## ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్



క్రికెటర్స్ కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఫ్యాన్స్ ఉండటం సహజమే. కొంతమంది ప్లేయర్స్ కైతే లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఆ ఆటగాళ్ల గ్లామర్ కు, ఆటతీరుకు.. అమ్మాయిలు ఫిదా అవ్వడంతో పాటు వారిపై విపరీతంగా క్రష్ ఫీలింగ్ ను పెంచేసుకుంటారు. వారితో ఒక్కసారి మాట్లాడితే చాలు, ఒక్క ఫొటో దిగితే చాలు అని తెగ ఆరాటపడిపోతుంటారు. అయితే తాజాగా 'డేట్ విత్ ఏ సూపర్ స్టార్' అనే షోలో పాల్గొన్న ఆస్ట్రేలియా టెస్ట్ కెప్టెన్ పాట్ కమిన్స్ తనపై ఉండే ఫీమేల్ అటెన్షన్ ను ఎలా డీల్ చేస్తాడో చెప్పుకొచ్చాడు. తనపై అమ్మాయిలు చూపించే క్రష్ ఫీలింగ్ ను తాను ఎలా ఫీల్ అవుతాడో తెలిపాడు. 'మీకు ఇండియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా మహిళల్లో మీకు విశేష అభిమానగణం ఉంది. చాలా మంది అమ్మాయిలకు, మహిళలకు మీరంటే చాలా ఇష్టం. నాతో సహా నా బెస్ట్ ఫ్రెండ్, మిగతా మహిళలకు మీపై క్రష్ ఫీలింగ్ ఉంది. 'ఓ నువ్వు ప్యాట్ కమిన్స్ ను కలుస్తున్నావా. నేను జెలసీగా ఫీలవుతున్నా' అని నా ఫ్రెండ్ నాతో మెసేజ్ కూడా చేసింది. మీకు పెళ్లి అయిందని ప్రతిఒక్కరికీ తెలుసు. కానీ మీరు ఇంతమంది అమ్మాయిల అభిమానాన్ని, ప్రేమను ఎలా సంపాదించుకోగలిగారు' అని హోస్ట్ సాహిబా బలి అడిగింది. దానికి కమిన్స్ ఆసక్తికరమైన సమాధానం చెప్పాడు. తనకు ఈ విషయాన్ని ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియట్లేదని అన్నాడు. కేవలం తన పని మాత్రమే తాను చేస్తానని చెప్పుకొచ్చాడు. అంతకుమించి ఎక్కువ ఆలోచించనని వెల్లడించాడు. "దీని గురించి ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలీదు. కేవలం నా పని నేను చేసుకుంటూ ముందుకెళ్తాను అంతే. అంతకుమించి ఇంకేం లేదు" అని అన్నాడు. 'మీరు ఫీమేల్ అటెన్షన్ ను ఎలా ఆస్వాదిస్తారు' అని మళ్లీ అడగగా.. ఇండియాలో ఫ్యాన్స్ చాలా క్రేజీగా ఉంటారని చెప్పాడు కమిన్స్. "ఫన్నీగా చెబుతున్నాను. భారత్ లో అభిమానులు చాలా క్రేజీగా ఉంటారు. ప్లేయర్స్ దాదాపుగా ఎక్కువ సమయాన్ని తమ జట్టుతో పాటు హోటల్ లోనే గడుపుతారు. ప్లేయర్స్ ఫ్యామిలీలు కూడా తమతో పాటే ఉంటాయి. కాబట్టి చాలా సందర్భాల్లో వేరే వాళ్లతో పర్సనల్ గా మాట్లాడటం కూడా కుదరదు." అని పేర్కొన్నాడు. కాగా, ఆస్ట్రేలియా జట్టు విషయానికొస్తే, బోర్డర్ గావస్కర్ ట్రోఫీని పదేళ్ల తర్వాత సొంతం చేసుకుంది. గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియాలో టీమిండియా 2–1తో సిరీస్‌ను దక్కించుకుంది. అయితే ఈసారి కూడా విజయంతోనే సిరీస్ ప్రారంభించినా, ఆ తర్వాత గాడి తప్పింది. దీంతో ఆస్ట్రేలియా గావస్కర్ ట్రోఫీని గెలవడంతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ 2025కు అర్హత సాధించింది. ఇప్పటికే దక్షిణాఫ్రికా ఫైనల్ చేరుకున్న సంగతి తెలిసిందే. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా ఫైనల్ జరగనుంది. రెండేళ్ల క్రితం జరిగిన తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు టీమిండిను ఓడించి, ట్రోఫీని ముద్దాడింది. వరుసగా ఇప్పుడు రెండోసారి ఫైనల్ కు చేరింది.

# ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమైన శ్రేయాస్ అయ్యర్

వచ్చే నెల నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ సందడి మొదలుకానుంది. టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. దీని కోసం జట్లను ప్రకటించడానికి చివరి తేదీ జనవరి 12గా ఐసీసీ నిర్ణయించింది. ఈ ఐసీసీ టోర్నీకి భారత జట్టును కూడా త్వరలో ప్రకటించనున్నారు. కానీ, దేశవాళీ టోర్నీల్లో నిరంతరం రాణిస్తున్న ఆ ఆటగాడికి అందులో అవకాశం దక్కుతుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. అతను ఇప్పటివరకు 5 టోర్నమెంట్లలో 1341 పరుగులు చేశాడు. అవును, ఇంతకుముందు గాయాలు, పేలవమైన ఫామ్‌తో ఆకట్టుకుంటోన్న శ్రేయాస్ అయ్యర్ గురించి మాట్లాడుతున్నాం. కానీ, 2024-25 దేశవాళీ సీజన్ బరిలోకి దిగిన శ్రేయాస్ అయ్యర్.. పరుగుల వర్షం కురిపిస్తున్నాడు. ఏది ఏమైనా వైట్ బాల్ క్రికెట్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ ఫస్ట్ లైన్ ప్లేయర్. అతను ఇప్పుడు ఉన్న ఫామ్‌ను చూస్తుంటే, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం దావా వేస్తున్నట్లేనని తెలుస్తోంది. అయ్యర్ ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్నాడు. అక్కడ అతని బ్యాట్ పరుగులు చేయడం లేదు. విజయ్ హజారే ట్రోఫీలో ఇప్పటివరకు ఆడిన 5 ఇన్నింగ్స్‌ల్లో శ్రేయాస్ అయ్యర్ 325 సగటుతో 325 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 2 అర్ధ సెంచరీలు సాధించాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 137 పరుగులుగా నిలిచింది. కానీ, ఇది కేవలం టోర్నీ మాత్రమే. ఇంతకు ముందు ఆడిన ఇతర టోర్నీల్లోనూ శ్రేయాస్ అయ్యర్ ఫామ్ ఇలాగే ఉంది. రంజీ ట్రోఫీ అయినా, అతను 4 మ్యాచ్‌ల్లో 5 ఇన్నింగ్స్‌లలో 90.40 సగటుతో 2 సెంచరీలతో సహా 452 పరుగులు చేశాడు. ఈ రెండు సెంచరీల్లో డబుల్ సెంచరీ కూడా ఉంది. రంజీతో పాటు, సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నమెంట్‌లో శ్రేయాస్ అయ్యర్ 8 ఇన్నింగ్స్‌లలో 188.52 స్ట్రైక్ రేట్‌తో 345 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అయ్యర్ 1 సెంచరీ, 1 అర్ధ సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ దులీప్ ట్రోఫీలో 3 మ్యాచ్‌ల్లో 154 పరుగులు చేయగా, ఇరానీ ట్రోఫీలో 1 మ్యాచ్‌లో 65 పరుగులు చేశాడు. ఈ రెండు



టోర్నీల్లోనూ అతడు సెంచరీ చేయలేదు. ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ఆడిన ఈ ఐదు టోర్నీల్లో శ్రేయాస్ అయ్యర్ చేసిన పరుగులను జోడిస్తే, అతని మొత్తం 1341 పరుగులు అవుతుంది. అయితే, ఈ సంఖ్య మరింత పెరగవచ్చు. ఎందుకంటే, విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆట కొనసాగుతోంది. విజయ్ హజారే ట్రోఫీ అనేది వైట్ బాల్ టోర్నమెంట్, అందులో అతను ప్రదర్శించిన ప్రదర్శన ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఎంపికయ్యేలా చేస్తుందని తెలుస్తోంది.

# తమీమ్ ఇక్బాల్ అద్భుతమైన ఇన్నింగ్స్

**48 బంతుల్లో 86 పరుగులతో అజేయ ఇన్నింగ్స్**

బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం టీ20 లీగ్ హవా నడుస్తోంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌తో సహా ప్రపంచంలోని అనేక మంది ఆటగాళ్ళు పాల్గొంటున్న టీ20 లీగ్ అక్కడ తుది స్థాయికి చేరుకుంది. జనవరి 6న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రెండు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. అందులో ఒక జట్టు కెప్టెన్ 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్ ఫార్చ్యూన్ బరిషల్ వర్సెస్ దర్బార్ రాజ్‌షాహీ జట్టు మధ్య జరిగింది. ఫార్చ్యూన్ బారిసల్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌కు 16 జట్లతో ఆడిన అనుభవం ఉంది. ఈ మ్యాచ్‌లో తమీమ్ అనుభవం అతని జట్టుకు చాలా ఉపయోగకరంగా మారింది. దాని కారణంగా అతని జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తమీమ్ ఇక్బాల్ తన జట్టుకు ద్విపాత్రాభినయం చేసి ముందుండి నడిపించాడు. ఓపెనర్‌గా వచ్చిన అతను తన జట్టు కోసం మ్యాచ్‌ను ముగించాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడుతూనే, కెప్టెన్‌గా తన బాధ్యతను కూడా నెరవేర్చాడు. తమీమ్ ఇక్బాల్ రాజ్‌షాహీ జట్టుపై ఫార్చ్యూన్ బరిషల్‌కు సిక్సర్‌తో విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజ్‌షాహి జట్టు ఫార్చ్యూన్ బరిషాల్‌పై 20 ఓవర్లలో 169 పరుగుల విజయలక్ష్యంతో నిర్దేశించుకుంది. దీనిని ఛేదించేందుకు బ్యాటింగ్ ప్రారంభించిన తమీమ్ ఇక్బాల్ 48 బంతుల్లో 86 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. 179 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడిన అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. తమీమ్ బ్యాట్ నుంచి వచ్చిన మూడో సిక్సర్ జట్టు గెలుపు స్క్రిప్ట్‌ను రచించింది. బంగ్లాదేశ్ దిగ్గజ ఆటగాళ్లలో తమీమ్ ఇక్బాల్ పేరు కూడా ఉంది. అతను తన దేశం తరపున అత్యధిక పరుగులు, అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్. బంగ్లాదేశ్ సీనియర్ జట్టు తరపున క్రికెట్ ఆడడమే కాకుండా, మరో 15 జట్లకు క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. అందులో ఒకటి ఫార్చ్యూన్ బరిషల్.

# గిల్ ను మూడు ఫార్మాట్లలో ఆడిస్తున్నారు

**గిల్ కంటే చాలామంది నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు**

**సూర్య కుమార్ కు చాన్స్ దొరికితే పాతుకుపోతాడు**

**మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ మండిపాటు**



ఇటీవల ఆస్ట్రేలియా పర్యటన కొంతమంది ఇండియన్ ప్లేయర్లకు చేదు అనుభవాలు మిగిల్చింది. సినియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఘోరంగా విఫలమై జట్టులో చోటును ప్రశ్నార్థకం చేసుకున్నారు. కోహ్లీ ఐదు టెస్టులు ఆడగలిగాడు కానీ, చివరి టెస్టులో రోహిత్ పై వేటు పడిపోయింది. ఇక యువ ఆటగాళ్ల విషయానికొస్తే వన్ డౌన్ బ్యాటర్ శుభమాన్ గిల్ తీవ్రంగా నిరాశపరిచాడు. మూడు టెస్టులు ఆడిన గిల్.. 18 సగటుతో కేవలం 91 పరుగులు మాత్రమే చేశాడు. అతని అత్యధిక స్కోరు కేవలం 31 మాత్రమే కావడం గమనార్హం. ఇక గిల్ లాంటి ప్లేయర్లకు చాలా అవకాశాలు ఇవ్వడంపై మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ మండిపడ్డాడు. ఇన్ని చాన్సులు ఇచ్చినా అతను సద్వినియోగం చేసుకోలేదని మండిపడ్డాడు. గిల్ ను మూడు ఫార్మాట్లలో ఆడిస్తున్నారని, అయితే అతను చాలా ఓవర్ రేటేడ్ అని శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. గిల్ కు దొరికిన అవకాశాలు మరే ఇతర ఆటగాడికి లభించినట్లయితే అద్భుతాలు చేసి ఉండేవారని అభిప్రాయ పడ్డాడు. ఉదాహరణకు సూర్య కుమార్ యాదవ్ కు ఇన్ని చాన్సెస్ దొరికినట్లయితే టెస్టుల్లో పాతుకు పోయి ఉండేవాడని పేర్కొన్నాడు. తను ఒక టెస్టు మాత్రామే ఆడాడని, ఆ తర్వాత తనను పక్కన పెట్టి లిమిటెడ్ ఓవర్ల క్రికెట్ కు మాత్రమే పరిమితం చేశారని ఆరోపించాడు. ఇక యంగ్ ప్లేయర్ల కోసం చూసినట్లయితే సాయి సుదర్శన్, రుతురాజ్ గైక్వాడ్ రూపంలో చాలామంది నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారని వ్యాఖ్యానించాడు. దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు సాధిస్తున్నా, రుతురాజ్ కు జాతీయజట్టులోకి పిలుపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక సాయి సుదర్శన్ కూడా తరచూ ఇండియా ఏ తరపున విదేశీ టూర్లలో సత్తా చాటుతున్న తనను జాతీయ జట్టులోకి తీసుకోవడం లేదని శ్రీకాంత్ మండిపడ్డాడు. ఇలాంటి ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని అభివర్ణించాడు. గిల్ తనకు దొరికిన అవకాశాలను వేస్ట్ చేసుకుంటున్నాడని, తనో ఓవర్ రేటెడ్ ప్లేయరని తెలిపాడు. తాను ముందు నుంచి ఇదే విషయాన్ని చెబుతున్నానని, ఇప్పుడది ప్రూవ్ అయిందని పేర్కొన్నాడు. దేశంలో ప్రతిభ గల యువకలకు కొదువ లేదని, ఇప్పటికైనా యువ ప్లేయర్లను ప్రోత్సహించాలని సూచించాడు. మరోవైపు గిల్ పై ప్రస్తుతమున్న సెలెక్షన్ కమిటీ చాలా నమ్మకముంచింది. గౌతం గంభీర్ కోచ్ గా పగ్గాలు చేపట్టాకా, లిమిటెడ్ ఓవర్ల క్రికెట్లో వైస్ కెప్టెన్ గా కూడా నియమించింది. అయితే స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో గిల్ తరచూ విఫలమవుతున్నాడు. తాజా ఆసీస్ పర్యటనలో తొలిసారి వెళ్లిన యశస్వి జైస్వాల్ అదరగొట్టాడు. తనే జట్టు తరపున లీడింగ్ స్కోరర్ గా నిలిచాడు. అయితే గిల్ కు గతంలో ఆసీస్ లో ఆడిన అనుభవం ఉన్నప్పటికీ, ఈసారి ఉస్సూరుమనిపించాడు. తన ఆటతీరు ఇలాగే కొనసాగితే ఉద్వాసన ఖాయమని మాజీలు హెచ్చరిస్తున్నారు.

# దివి అందాల వడ్డన ఎవరి కోసమో?

వైట్ కలర్ శారీలో దిగిన ఫోటో షూట్ ను పోస్ట్ చేసిన దివి.. వడ్డించా నేను చాలా నీకు? అంటూ క్యాప్షన్ పెట్టింది. ప్రస్తుతం దివి పిక్స్ ఫుల్ వైరల్ గా మారాయి. బిగ్ బాస్ బ్యూటీ, టాలీవుడ్ భామ దివి వద్యాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. అందం, అభినయంతో ఆమె తనకంటూ స్పెషల్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుందనే చెప్పాలి. బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్లి తన క్రేజ్ ను మరింత పెంచుకుంది. అప్పట్లో మహేష్ బాబు మహర్షి చిత్రంలో ఓ సీన్ లో కనిపించినా.. పెద్దగా ఎవరూ స్పెషల్ గా గుర్తించలేదు. అంతకు ముందు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు, ప్రకటనల్లో సందడి చేసింది దివి. కానీ బిగ్ బాస్ షోతో తర్వాత మాత్రం తెలుగు వారందరికీ బాగా దగ్గరైందని చెప్పాలి. దివి ఫాలోయింగ్ తో పాటు క్రేజ్ కూడా ఓ రేంజ్ లో పెరిగింది. అలా టాలీవుడ్ లో క్రేజీ బ్యూటీగా మారిపోయిన ముద్దుగుమ్మ దివికి వరుసగా మంచి ఆఫర్స్ వస్తున్నాయి. రీసెంట్ గా లంబసింగి మూవీతో హీరోయిన్ గా మారింది దివి. కొన్ని వెబ్ సిరీసులు, వీడియో సాంగ్స్ తో ఆకట్టుకున్న అమ్మడు.. ప్రస్తుతం పలు ఆఫర్స్ తో బిజీ బిజీగా గడుపుతూనే ఉంది. ఇటీవల హరికథ వెబ్ సిరీస్ తో మెప్పించిందనే చెప్పాలి. అదే సమయంలో సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తోంది ముద్దుగుమ్మ దివి. అయితే ఓవైపు సినిమాలు, వెబ్ సిరీసుల్లో బిజీగా ఉన్న దివి.. మరోవైపు సోషల్ మీడియాలో యమా యాక్టివ్. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన గ్లామరస్ పిక్స్ ను షేర్ చేసే అమ్మడు.. పర్సనల్ లైఫ్ తో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలు పంచుకుంటూ ఉంటుంది. తాజాగా షేర్ చేసిన పిక్స్ అయితే వేరే లెవెల్. వైట్ కలర్ శారీలో దిగిన ఫోటో షూట్ ను పోస్ట్ చేసిన దివి.. వడ్డించా నేను చాలా నీకు? అంటూ క్యాప్షన్ పెట్టింది. ప్రస్తుతం దివి పిక్స్ ఫుల్ వైరల్ గా మారాయి. ఒక్కో ఫోటోలో దివి అందాల ఆరబోత అదుర్స్ అనే చెప్పాలి. రకరకాల పోజులు ఇచ్చి తన గ్లామర్ తో మైమరిపిస్తున్న ముద్దుగుమ్మ.. వేరే లెవెల్ లో అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో దివి నయా పిక్స్ పై నెటిజన్లు తెగ స్పందిస్తున్నారు. గ్లామరస్ ఫోటోస్ కు కేరాఫ్ అడ్రస్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందానికి ఫిదా అయ్యామని చెబుతున్నారు. ఓ రేంజ్ లో లైకులు కొడుతున్న నెటిజన్లు.. కామెంట్లు పెడుతూ షేర్ చేస్తున్నారు. అందాల వడ్డన ఎవరి కోసమని సరదాగా క్వశ్చన్ చేస్తున్నారు



# పండోరా గ్రహంపై కీర్తి సురేష్ హనీమూన్



ఇంతలోనే కీర్తి న్యూఇయర్ సెలబ్రేషన్ కం హనీమూన్ ట్రిప్ గురించి ఆసక్తికర విషయం తెలిసింది. కీర్తి సోషల్ మీడియాల్లో షేర్ చేసిన ఫోటోగ్రాఫ్స్ ని బట్టి థాయ్‌లాండ్ వెళ్లినట్టు అర్థమవుతోంది. మహానటి కీర్తి సురేష్ ప్రేమించిన సఖుడు ఆంటోనీని పెళ్లాడిన సంగతి తెలిసిందే. దుబాయ్ కేంద్రంగా పలు దేశాల్లో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన ప్రముఖ బిజినెస్ మేన్ ఆంటోని తట్టిల్ కి కీర్తి చాలా కాలంగా స్నేహితురాలు. ఈ జంట కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు. చివరికి పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లితో కీర్తి లైఫ్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. కీర్తి పెళ్లి తర్వాత నటిస్తుందా లేదా? అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ప్రస్తుతానికి కీర్తి సురేష్ హనీమూన్ కోసం ఎక్కడ ప్లాన్ చేసింది? అంటూ అభిమానుల్లో సందేహాలు ఉన్నాయి. కొత్త సంవత్సర వేడుకల కోసం కీర్తి ఒక ఎగ్జోటిక్ లొకేషన్ కి వెళ్లింది. ఇదే లొకేషన్ కీర్తి- ఆంటోని జంటకు హనీమూన్ డెస్టినేషన్ అయిందా? అంటూ ఆరాలు కొనసాగుతున్నాయి. అయితే ఇది గోవానా? లేక ఇంకేదైనా విదేశీ డెస్టినేషన్ అయ్యుండొచ్చా? అంటూ అభిమానులు డౌట్లు వ్యక్తం చేస్తున్నారు. ఇంతలోనే కీర్తి న్యూఇయర్ సెలబ్రేషన్ కం హనీమూన్ ట్రిప్ గురించి ఆసక్తికర విషయం తెలిసింది. కీర్తి సోషల్ మీడియాల్లో షేర్ చేసిన ఫోటోగ్రాఫ్స్ ని బట్టి థాయ్‌లాండ్ వెళ్లినట్టు అర్థమవుతోంది. భర్తతో కలిసి కొత్త సంవత్సరాన్ని ఎగ్జోటిక్ బీచ్ లొకేషన్ లో సెలబ్రేట్ చేసుకుంది. ఈ క్రమంలో కొన్ని ఫోటోలు, వీడియోలు అభిమానులతో షేర్ చేసుకుంది. ఈ ఫోటోగ్రాఫ్స్ చూశాక కీర్తి అద్భుతమైన పండోరా(అవతార్ సినిమాలో ఉంది) లాంటి గ్రహంపై హనీమూన్ ప్లాన్ చేసిందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. కీర్తి థాయ్ బీచ్ లో సుందరమైన సముద్ర తీరాన ఫుల్ గా చిల్ చేసింది. సముద్రంలో కయాకింగ్ కూడా చేసింది. ప్రస్తుతం బీచ్ వెకేషన్ కి సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. గత డిసెంబర్ 24న గోవాలో బాయ్ ఫ్రెండ్ ఆంటోనీని మ్యారేజ్ చేసుకున్న కీర్తి, హిందూ- క్రిస్టియన్ స్టైల్ లో పెళ్లి చేసుకోవడం ఆసక్తిని కలిగించింది. కీర్తి పెళ్లి నుంచి చాలా ఫోటోలు వీడియోలు ఇప్పటికే వెబ్ లో వైరల్ అయ్యాయి. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే కీర్తి తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి



# బుట్ట బొమ్మ ఈ సారి పక్కా ప్లానింగ్‌తో..!


ఒకప్పుడు గ్లామర్ కే ప్రాధాన్యత ఇస్తూ సినిమాలు చేసిన అమ్మడు ఇప్పుడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా చేయాలని భావిస్తుంది. బుట్ట బొమ్మ పూజా హెగ్దేని టాలీవుడ్ దూరం పెట్టినా కూడా మొన్నటిదాకా ఒకటి రెండు అవకాశాలతో సరిపెట్టుకున్న అమ్మడు ఇప్పుడు ఏకంగా ఐదారు సినిమాలతో బిజీ బిజీగా మారింది. బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తున్న అమ్మడు ఆ సినిమా తర్వాత రెండు ఆఫర్లను పట్టేసింది. ఇక కోలీవుడ్ లో దళపతి విజయ్ సినిమాతో పాటుగా సూర్య రెట్రోలో కూడా నటిస్తుంది. ఈ సినిమాలతో అక్కడ కూడా మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది అమ్మడు. పూజా హెగ్దే ఈసారి పక్కా ప్లానింగ్ తో సినిమాలు చేస్తుందని అనిపిస్తుంది. ఒకప్పుడు గ్లామర్ కే ప్రాధాన్యత ఇస్తూ సినిమాలు చేసిన అమ్మడు ఇప్పుడు నటనా ప్రాధాన్యత ఉన్న పాత్రలను కూడా చేయాలని భావిస్తుంది. ఈ క్రమంలో బుట్ట బొమ్మ పూజా హెగ్దే తన సినిమాల అవకాశాల గురించి రీసెంట్ గా మాట్లాడింది. తన కెరీర్ సంతృప్తికరంగా ఉందని అంటున్న అమ్మడు. పాత్రల ఎంపిక కాదు అందులో జీవించడం ముఖ్యమని అంటుంది. అంతేకాదు ప్రొఫెషనల్ గా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉన్నా అంటుంది పూజా. సినిమాలో పూజా హెగ్దే ఉంది అంటే గ్లామర్ షో తప్పనిసరి అని ఫిక్స్ అయ్యారు ఆడియన్స్. అలాంటిది అమ్మడు పాత్ర ప్రాధాన్యత ఉంటేనే గ్లామర్ షో చేస్తానని అంటుంది. అది కొంతమేరకు మంచిదే అయినా అమ్మడి థై షోకి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు కాబట్టి వాళ్లని నిరాశ పరచకుండా ఉంటే బెటర్ అని చెప్పొచ్చు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరుగుతున్నాయని తెలుస్తున్నా వాటిలో ఏది ఫైనల్ అవ్వలేదు. తెలుగులో మొన్నటిదాకా స్టార్ సినిమా అయితే ఆమె ఫస్ట్ ఆప్షన్ అనిపించగా ఇప్పుడు అమ్మడు తిరిగి మళ్లీ అలాంటి ఛాన్స్ లు పొందేందుకు చాలా కష్టపడుతుంది. మరి పూజా బేబీ పెడుతున్న ఈ ఎఫర్ట్స్ అమ్మడికి ఏమేరకు ఫలితాన్ని అందిస్తాయన్నది చూడాలి. పూజా హెగ్దే గ్లామర్ కాకుండా యాక్టింగ్ మీద ఎక్కువ ఫోకస్ చేస్తే మాత్రం ఫ్యాన్స్ హర్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. బాలీవుడ్ సినిమాలేమో కానీ తమిళ్ లో పూజా చేస్తున్న రెండు సినిమాలు భారీ అంచనాలతో వస్తున్నాయి కాబట్టి వాటితో పూజా అక్కడ తిరుగులేని క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు.



# తారక్ వర్సెస్ తారక్!

ప్రస్తుతం షూటింగ్ ముంబైలో వేసిన ప్రత్యేక సెట్లలో జరుగుతోంది. అందులో తారక్ కూడా పాల్గొంటున్నారు. %దీఎ: ౨బజూఖు౨ఌ ణవం౨ ఎ 6 జీఖఅ 2025 11:00ౡవీ% యంగ్ టైగర్ ఎన్టీఆర్ %-%వార్ -2%-% తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తోన్న చిత్రమిది. ఆయాన్ ముఖర్జీ భారీ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తారక్-హృతిక్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయని ప్రచారంలో ఉంది. అలాగే ఇద్దరి మధ్య ఓ స్పెషల్ సాంగ్ సైతం ఉంటుందని వినిపిస్తుంది. ఇద్దరు మంచి డాన్సర్లు కావడంతో అందులో పోటా పోటీ తప్పదు. %ౄశ్రీఖఎఖఅఎబ్వ / ౠశీఖఎవఎ: 0.97% ఖీబశ్రీశ్రీంఎతీవవఅ% ప్రస్తుతం షూటింగ్ ముంబైలో వేసిన ప్రత్యేక సెట్లలో జరుగుతోంది. అందులో తారక్ కూడా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. తారక్ ఇందులో రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించనున్నారట. దీనిలో భాగంగా తారక్ వర్సెస్ తారక్ అన్నట్లు ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఆ రెండు పాత్రల మధ్య ఉంటుందని బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. %ూశ్రీంశీ =ఖుఎ% - భారతదేశంలో అత్యంత సంపన్న గాయకుడు %-%వార్%-% లో కూడా టైగర్ ష్రాప్ రెండు డిఫరెంట్ షేడ్స్ లో కనిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తారక్ పాత్రని మరింత బలంగా చూపించబోతున్నారట. దీంతో తారక్ పై ఆ యాక్షన్ ఎపిసోడ్ ఎలా ఉంటుందనే ఆసక్తి పెరిగిపోతుంది. ఈ సినిమాకి హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు, టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలు ఎంతో క్రియేటివ్ గా రియలిస్టిక్ గా తీర్చిదిద్దుతున్నారట. యాక్షన్ సన్నివేశాలకే భారీగా ఖర్చు చేస్తున్నారుట. ఆ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా ముందుకెళ్తున్నారట. తారక్ పై చిత్రీకరణ కూడా దాదాపు ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెలఖరుతో తారక్ పోర్షన్ షూటింగ్ పూర్తవుతుందంటున్నారు. షూటింగ్ అంతా ఏప్రిల్ కల్లా ముగిస్తారని వార్తలొస్తున్నాయి

# స్పీడ్ తగ్గిస్తానంటోన్న మీనాక్షి!



మీనాక్షి చౌదరి కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో అమ్మడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెండ్ భామగా మారుతోంది. మీనాక్షి చౌదరి కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో అమ్మడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెండ్ భామగా మారుతోంది. ఈ ఏడాది %-%గుంటూరు కారం%-, -%లక్కీ భాస్కర్%-% తో భారీ విజయాలు అందుకుంది. దళపతి విజయ్ తో %-%ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో స్క్రీన్ షేర్ చేసుకుంది. పాన్ ఇండియాలో రిలీజ్ అయిన వరుణ్ తేజ్ %-%మట్కా%-%లోనూ నటించింది. %-%మెకానిక్ రాకీ%-%తోనూ మురిపించింది. సింగపూర్ సెలూన్ అనే తమిళ సినిమాలోనూ కనిపించింది. ఇలా ఏడాదంతా అమ్మడు సినిమాలతో సందడి చేసింది. ఇక కొత్త ఏడాదిలో సంక్రాంతి కానుకగా %-%సంక్రాంతి కి వస్తున్నాం ? అంటూ ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఇందులో అమ్మడు వెంకటేష్ కి ప్రియురాలి పాత్రలో అలరించనుంది. అయితే ఇదే ఏడాది అమ్మడు కొన్ని మార్పులకు ఛాన్స్ ఇచ్చింది. ఇకపై సినిమాలు ఎడెపెడా చేయనని...నంబర్ కోసం కాకుండా మంచి కథలు మాత్రమే ఎంచుకుని పనిచేస్తానని తెలిపింది. %ూశ్రీంశీ =ఖుఎ% - గేమ్ ఛేంజర్.. టార్గెట్ ఎంతంటే? 2024 ఒకే ఏడాది అన్ని సినిమాలు రిలీజ్ అవుతాయని ఎప్పుడూ అనుకోలేదని..అదంతా దానంతటదే జరిగిపోయిందని చెప్పుకొచ్చింది. ఇప్పటి వరకూ ఎక్కువగా సినిమాలకే సమయం కేటాయించానని, ఇకపై కుటుంబం కోసం, తన కోసం ఎక్కువగా సమయం కేటాయించాలకుంటున్నట్లు తెలిపింది. మీనాక్షి కెరీర్ ఐదేళ్ల క్రితమే మొదలైంది. తొలి సినిమా %-%ఇచట వాహనములు నిలుపరాదు%-%లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. అప్పుడే త్రివిక్రమ్ ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత %-%హిట్ ది సెకెండ్ కేస్%-% తో మరో హిట్ పడింది. %-%ఖిలాడీ%-%తో వైఫల్యం ఎదురైనా మీనాక్షి జోరును ఆ ఫ్లాప్ ఆపలేకపోయింది. అప్పటి నుంచి వరుసగా సినిమాలు చేసుకుంటూ బిజీ అయింది. ప్రస్తుతం నవీన్ పోలిశెట్టితో %-%అనగనగా ఒక రాజు%-%లో నటిస్తోంది. అలాగే మరో రెండు చిత్రాలు కూడా ఆన్ సెట్స్ లో ఉన్నాయి.